ప్రజాశక్తి

మంగళవారం 1 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

సచివాలయాల కుదింపు!

ఉమ్మడి జిల్లాలో 30 శాతం తగ్గింపు - గుంటూరులో 206కి 106 ఉంచాలని ప్రతిపాదన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థలో సమూల మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ నూతన మార్గదర్శకాల మేరకు అధికారులు నిర్వహించిన కసరత్తులో సచివాలయాల సంఖ్యను భారీగా కుదించాలని ప్రతిపాదించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో రేషనలైజేషన్ పేరుతో జిల్లాలోని సచివాలయాలను సగానికి సగం తగ్గించాలని ప్రణాళిక రూపొందించారు. గుంటూరు నగర పాలకసంస్థ పరిధిలో 206 వార్డు సచివాలయాలుండగా వీటిని 106కు కుదిస్తూ అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఏయే వార్డులు, ఏయే ప్రాంతాలు ఫలనా సచివాలయం పరిధిలో ఉంచాలో నిర్ధారిస్తూ మ్యాపింగ్ చేశారు. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో సచివాలయంలో 9 మంది ఉద్యోగులు ఉండేలా చూడాలని, మిగతా వారిని ఆయా శాఖల కార్యాలయాల్లో సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలోని ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లో కూడా సచివాలయల సంఖ్యను దాదాపు 30 శాతం వరకు తగ్గించనున్నారు. ప్రధానంగా గుంటూరుతో పాటు అన్ని మునిసిపాలిటీల్లో దాదాపు 40 నుంచి 50 శాతం వరకు తగ్గనున్నాయి. రెవెన్యూ గ్రామానికి ఒకటి యథాతథంగా కొనసాగుతుంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1334 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిల్లో నాలుగేళ్ల క్రితం దాదాపు 14 వేల మంది ఉద్యోగులు నియమితులయ్యారు. వీరిలో దాదాపు నాలుగు వేల మంది వేర్వేరు ఉద్యోగాలకు వెళ్లిపోయారు. మరికొంత మంది దీర్ఘకాలిక సెలవుల్లో ఉన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థ ద్వారా పాలనా యంత్రాంగం ప్రజలకు బాగా చేరువైంది. గ్రామ సచివాయాల్లో 11 మంది, పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉద్యోగులను 2019లో నియమించారు. మొత్తం 35 శాఖల పరిధిలో 540 రకాల సేవలు అందిస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయాల వ్యవస్థపై సమీక్ష చేసి పట్టణాలు, నగర ప్రాంతాల్లో 8 వేల మందికి ఒక సచివాలయం ఉండాలని, పెద్ద గ్రామాల్లో 5000 మందికి ఒక సచివాలయం ఉండాలని ప్రతిపాదించారు. ప్రతి పంచాయతీలో సగటున ఒక సచివాలయం కొనసాగిస్తారు. మొత్తం ఎ, బి, సి కేటగిరిలో

▶ 2లో

ఘనంగా రంజాన్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి : రంజాన్ సందర్భంగా గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఈద్గాల వద్ద సోమవారం ప్రత్యేక ప్రార్థనలు చేయగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు. గుంటూరులోని కలెక్టరేట్ రోడ్డులో నగరంపాలెం ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. పొన్నూరు రోడ్డులో ముస్లిం కళాశాల వద్ద ఉన్న ఈద్గాలో ఎమ్మెల్యే నశీర్ అహ్మద్, టిడిపి నాయకులు షేక్ షౌకత్, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఎమ్మెల్యే గళ్లా మాధవి తన కార్యాలయంలో ముస్లిములకు మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణపై నిరసన

వక్ఫ్‌చట్ట సవరణపై పలుచోట్ల నిరసనలు తెలిపగా గుంటూరులో మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి ఆధ్వర్యంలో ఈద్గాల వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. చేతులకు నల్లరిబ్బన్లు కట్టుకుని మసీదులు, ఈద్గాలల్లో జరిగిన ప్రార్థనాల్లో కూర్చొన్నారు. చట్టసవరణ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని మస్తాన్‌వలి డిమాండ్ చేశారు.

మంగళగిరిలో నిరసన

స్కేటింగ్ అంతర్జాతీయ పోటీల్లో గుంటూరు జిల్లాకు పతకాలు

తైవాన్‌లో జెస్సిరాజ్, ఆశిష్ మెరుపులు

ప్రజాశక్తి - మంగళగిరి, తాడేపల్లి

తైవాన్‌లో నిర్వహించిన అంతర్జాతీయ స్కేటింగ్ పోటీల్లో గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు పతకాలు సాధించారు. వీరిలో ఒకరు భారత ప్రధానమంత్రి బాల పురస్కార్ అవార్డు గ్రహీత మంగళగిరికి చెందిన మాత్రపు జెస్సిరాజ్ కాగా మరొకరు తాడేపల్లి పట్టణం, డోలాస్ నగర్‌కు చెందిన మెరుగుపాల ఆశిష్. జెస్సిరాజ్.. సోలో డాన్స్, కపుల్ డాన్స్ విభాగాల్లో రెండు బంగారు పతకాలు, పెయిర్ స్కేటింగ్లో రజతం, ఇన్ లైన్ ఫ్రీ స్టైల్‌లో కాంశ్య పతకాలు సాధించి దేశపతకాన్ని రెపరెపలాడించింది. జెస్సి రాజ్‌కు ఏషియన్ ఆర్టిస్ట్ స్కేటింగ్ చైర్మన్ అలెక్స్ వాంగ్ గోల్డ్ మెడల్స్‌ను అందజేశారు. తాడేపల్లికి చెందిన ఆశిష్... ఫ్రీ స్టయిల్, ఇన్‌లైన్, సోలో డాన్స్ విభాగాల్లో రెండో స్థానంలో నిలిచి రజత పతకాలు సాధించాడు. ఆశిష్‌కు కోచ్ పి.సత్యనారాయణ, చిట్టి బాబు, రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి పి.థామస్, గుంటూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనీలిమ, పి.శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

5లో

'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు'

సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ వాల్ స్టిక్కర్లు పంపిణీ

పి-4 వల్ల పేదలకు ఒరిగేదేమీ లేదు

పథకాలను ప్రారంభించకుండా చంద్రబాబు ప్రచారార్భాటం

మాజీ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం చంద్రబాబు ప్రచార ఆర్భాటమే గాని ప్రజలకు ఒరగబెట్టేదేమీ లేదని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టించి పేదలకు పంచుతానని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు కొత్తగా పి-4 అంటూ మోసం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నాయని, ఇందుకు బియ్యం కార్డులే సాక్ష్యమని, వీరందరినీ ఆదుకోవడానికి ఆదాయపన్ను కడుతున్న 8.65 లక్షలమంది సహకరించాలని చంద్రబాబు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. 2014-19 మధ్య కాలంలో కూడా ఉన్నతాధికారులు, ధనికులను గ్రామాలను దత్తత తీసుకుంటున్నారని పెద్ద ఎత్తున ప్రచార ఆర్భాటం చేసినా ఆచరణలో ఎక్కడా ఎవ్వరూ దత్తత తీసుకుని అభివృద్ధి చేయలేదని చెప్పారు. ఇప్పుడు పేదలను ఆదుకునే పేరుతో పి-4 అంటూ

▶ 2లో

వివరాలు వెల్లడిస్తున్న పోలీసు.. వెనక ముసుగుల్లో నిందితులు

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్టు

మూడు కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి- తాడేపల్లి

గంజాయిని విక్రయించే ముగ్గుర్ని పోలీసులు అదుపులోకి తీసుకోవడంతోపాటు వారి వద్ద నుండి 3 కిలోల సరుకును స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు వివరాలను తాడేపల్లి సిఐ బత్తుల కళ్యాణ్ రాజు, ఎస్ఐ జె.శ్రీనివాసరావు సోమవారం వెల్లడించారు. తాడేపల్లి పట్టణంలోని బ్రహ్మానందపురం సమీపంలో ఎయిమ్స్‌కు వెళ్లే దారిలో గంజాయి అమ్ముతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ముత్యాల మనోజ్ కుమార్, ఎస్కే అమీద్‌బాషా, కైలా ప్రవీణ్ గంజాయి విక్రయిస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో మంగళవారం హాజరుపరుస్తామన్నారు.

సచివాలయాల కుదింపు!

(మొదటి పేజీ తరువాయి)

విభజించనున్నారు. ప్రతి సచివాలయంలో 9 మంది మంది ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఎంత మంది ఉద్యోగులను సచివాలయాల్లో కొనసాగిస్తారు? ఎంత మందిని ఇతర శాఖల్లో సర్దుబాటు చేస్తారన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. ఇంజినీరింగ్ అసిస్టెంట్లుగా పనిచేసే వారికి కనీసం జూనియర్ ఇంజనీర్ స్థాయి హోదా ఇచ్చి వివిధ శాఖలలో ఖాళీగాఉన్న పోస్టులలో నియమించి జెఈ లేదా ఎఈ స్కేలు వర్తింప చేయాలని బీటెక్, బిఈ, ఎంటెక్ అర్హత కలిగిన వారు కోరుతున్నారు. అయితే మునిసిపాలిటీల పరిధిలో పనిచేసే శానిటరీ అసిస్టెంట్‌లు తమకు శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని కోరుతున్నారు. ఇలా వారి విదార్హత ఆధారంగా ఆయా శాఖల్లో నియమించాలని కోరుతున్నారు. అంతేగాక ప్రస్తుతం ఖాళీల భర్తీ కూడా చేపట్టలేదు. ఈనేపధ్యంలో ప్రభుత్వం చేసే మార్పుల వల్ల తమకు మేలు జరుగుతుందా...ఇబ్బందులు వస్తాయా అన్న సందేహాలు ఉద్యోగుల్లో ఏర్పడ్డాయి.

మూడేళ్లుగా సచివాలయాల్లో ఏర్పడిన ఖాళీలను ప్రభుత్వం భర్తీ చేయడం లేదు. 11 మంది ఉండాల్సిన సచివాయాల్లో ఐదారుగురు పనిచేస్తున్నారు. దీంతో మిగతా వారిపై పనిభారం పెరిగింది. పట్టణ ప్రాంతాల్లో 10 మంది ఉండాల్సిన సచివాలయాలో ఆరేడు మంది ఉన్నారు. అదనపు విదార్హతలున్న వారు ఉన్నత చదువులు, పోటీ పరీక్షల కోసం ఇప్పటికే ఉద్యోగం వదులుకుని వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో ఖాళీలను భర్తీ చేయకుండా ఉన్న వాటిల్లోనే మార్పులు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా రేషనలైజేషన్ ద్వారా మల్టీపర్పస్ ఫంక్షనరీస్, టెక్నికల్ ఫంక్షనరీస్‌గా వీరిని విభజించాలనేది ప్రతిపాదన చేశారని తెలిసింది. మల్టీపర్పస్ ఫంక్షనరీస్ విభాగంలోకి విలేజ్ సెక్రటేరియట్ పరిధిలోని పంచాయతీ సెక్రటరీ, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీస్ వస్తారు. అలాగే వార్డు సెక్రటేరియట్‌లో వార్డు అడ్మినిస్ట్రేషన్ సెక్రటరీ, వార్డు ఎడ్యుకేషన్ అండ్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ సెక్రటరీ, వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి వస్తారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలోకి గ్రామ సచివాలయం పరిధిలో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఎఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, అగ్రికల్చర్ సెక్రటరీ, వెటర్నరీ సెక్రటరీ, ఎనర్జీ అసిస్టెంట్ ఉంటారు. టెక్నికల్ ఫంక్షనరీస్ విభాగంలో వార్డు సచివాలయంలో వార్డు రెవెన్యూ సెక్రటరీ, వార్డు హెల్త్ సెక్రటరీ, వార్డు ప్లానింగ్ సెక్రటరీ, వార్డు ఎమినిటీస్ సెక్రటరీ, వార్డ్ శానిటేషన్ సెక్రటరీ, వార్డు ఎనర్జీ సెక్రటరీ వస్తారు. ఈవిధంగా జనాభా ప్రాతిపదికన కూడా మార్పులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఎముకలు , కీళ్ల సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు : ఎముకలు, కీళ్ల సమస్యలపై అప్రమత్తంగా ఉండి, అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొత్తూరు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో 'ఎముకలు, కీళ్లకు సంబంధించిన సమస్యల'పై ఆరోగ్య సభ నిర్వహించారు. సభలో డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మానవ శరీర నిర్మాణం ఒక ఆకారంగా ఉండటంలో ప్రముఖ పాత్ర వహించే ఎముకలను ఆరోగ్యకరంగా ఉంచుకోవాలన్నారు. ఎముకల ఆరోగ్యానికి మనం తీసుకునే ఆహారంలో క్యాల్షియం ఉండేలా చూసుకోవాలని, మన ఆహారం ద్వారా తీసుకున్న కాల్షియం మన శరీరానికి పట్టడానికి విటమిన్-డి 3 కూడా చాలా ముఖ్యమన్నారు. సాధారణంగా ఏదో సమస్య వచ్చినప్పుడు కాల్షియం ఉన్న ఆహారం తీసుకోవాలని ప్రయత్నం చేయటం కంటే చిన్న వయసు నుంచే ఎముకలు గట్టిగా ఉండే విషయంలో దోహదపడే క్యాల్షియం ఎక్కువగా ఉన్న ఆహారాన్ని తీసుకుంటే మంచిదని సూచించారు. డీ-3 విటమిన్ గురించి తెలుపుతూ సాధారణంగా మనం ఉష్ణోగ్రత బాగా ఉన్న ప్రదేశంలో జీవిస్తున్నాను అని, డీ-3 విటమిన్ తీసుకోవాల్సిన అవసరం ఉండదనే అపోహలో ఉంటామని అన్నారు. కానీ తగు పరీక్షలు చేయించుకుని డీ-3 లోపం గనుక ఉంటే మందుల రూపంలో తీసుకోవడం మంచిదని సూచించారు. కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్స గురించి తెలియజేస్తూ ఈ విషయంలో రెండు మోకాళ్ళకు ఏకకాలంలో ఆపరేషన్ చేయించుకోవచ్చా అనే అపోహ చాలామందిలో ఉంటుందని, వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని బట్టి అధునాతన సౌకర్యంతో కూడిన థియేటర్ ఉన్న హాస్పిటల్స్‌లో ఏకకాలంలో రెండు మోకాళ్ళకు ఒకే సమయంలో శస్త్ర చికిత్స చేయించుకోవచ్చని సూచించారు. ఈశస్త్ర చికిత్స అనంతరం ఫిజియోథెరపీ కూడా ప్రముఖ పాత్ర పోషిస్తుందని, ఈ నేపథ్యంలో నిర్లక్ష్యం చేయటం తగదని సూచించారు.

నరసరావుపేటలో ఓ పాట విడుదల

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రముఖ సినీనటుడు నందమూరి కళ్యాణ్ రామ్ నరసరావుపేటలో సందడి చేశారు. కళ్యాణ్ రామ్, సీనియర్ నటి విజయశాంతి ప్రధాన పాత్రల్లో నటించిన 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఓ పాటను పట్టణంలోని రవి కళామందిర్ థియేటర్‌లో సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళ్యాణ్ రామ్ సినిమా పాటకు అనుగుణంగా స్టెప్పులు వేసి అభిమానులను అలరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు కుమారుడు డాక్టర్ ఆదిత్య పాల్గొని కళ్యాణ్‌రామ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, దర్శి టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి గృహాన్ని కళ్యాణ్‌రామ్ సందర్శించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. కడియాల హాస్పిటల్స్ వద్దకు చేరుకున్న అభిమానులకు కళ్యాణ్‌రామ్ అభివాదం చేశారు.

పి-4 వల్ల పేదలకు ఒరిగేదేమీ లేదు

(మొదటి పేజీ తరువాయి)

పారిశ్రామిక వేత్తలను, కాంట్రాక్టర్లను పిలిపించి హడావుడి చేయడం తప్ప ప్రజలకు జరిగేదేమీ ఉండదన్నారు. ఎన్నికల మేనిఫెస్టో, సూపర్-6 పథకాలను ఎగ్గొట్టేందుకు ఈ హడావుడి చేస్తున్నారని ఎద్దేవ చేశారు. ప్రజలకు ఇవ్వాల్సిన ఒక్క పథకాన్ని ఇంత వరకు ప్రారంభించలేదన్నారు. వైసిపి హయాంలో ప్రారంభించిన కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం ద్వారా ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ డబ్బున్న వారు సీట్లు కొనుక్కొనేలా చేస్తున్నారని, పేదలను ఆదుకోవడం అంటే ఇదేనా అని నిలదీశారు. రాష్ట్ర సంపదను బడా కాంట్రాక్టర్లుకు, కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టి వారి నుంచి సిఎస్ఆర్ ఫండ్స్ పేరుతో చేసే సేవ కార్యక్రమాలనే పేదలకు సాయం చేయాలంటూ చంద్రబాబు సూచిస్తున్నారని ఎద్దేవా చేశారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ కోసం ప్రదర్శనలు

ప్రజాశక్తి - తుళ్లూరు

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కెవిపిఎస్, క్రైస్తవ సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శనివారం రాత్రి రాజధాని ప్రాంతం తుళ్లూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కెవిపిఎస్ రాజధాని డివిజన్ కార్యదర్శి జొన్నకూటి నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ నిష్పక్షపాతంగా జరగాలని, ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే యత్నాలు పన్నే వారిపట్ల ప్రజలు జాగూరకతతో వ్యవహరించాలని కోరారు. ర్యాలీకి సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మద్దతు తెలిపి మాట్లాడుతూ ప్రవీణ్ మృతి వెనుక కుట్ర కోణం దాగుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, వాటిని నివృత్తి చేయాలని కోరారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

పట్టణంలోని క్రిస్టియన్ పేట లూథరన్ చర్చ్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సంఘ పెద్దలు మాట్లాడుతూ పాస్టర్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దోషులు ఎంత వారైనా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లూథరన్ చర్చి పెద్దలు వడ్లమూడి డానియల్ రాజు, ఎం.ఏసోబు, ఏసుబాబు, శానం ప్రభాకర్, వనమా మోషే, ఎ.వివేక్ పాల్గొన్నారు. ఉండవల్లి అంబేద్కర్ నగర్లో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించగా డి జ్యోతిబసు, శేషయ్య పాల్గొన్నారు. పెనుమాకలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సత్తెనపల్లిలో క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శన నిర్వహించారు. సత్తెనపల్లి ప్రాంత సార్వత్రిక క్రైస్తవ సమాఖ్య, యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో వివిధ క్రైస్తవ సంఘాల కాపరులు, నాయకులు, స్త్రీలు, యవ్వనస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తాలూకా సెంటర్లో మానవహారంగా ఏర్పడ్డారు. స్థానిక లూథరన్ చర్చ్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన తాలూకా సెంటర్, గడియారపు స్తంభం నుంచి ఐదు లాంతర్లు సెంటర్ వరకు సాగింది. తాలూకా సెంటర్లో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీయోను లూథరన్ చర్చ్, బాగ్స్ మెమోరియల్ సెంటినరి బాప్టిస్ట్ చర్చ్, సెంటినరి తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చ్, షాలెం చర్చ్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు విన్నవించినా పట్టించుకోవడం లేదు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నెల మొత్తం పని చేసినా 10 నుండి 15 రోజులకు మాత్రమే వేతనాలు చెల్లిస్తున్నారని, తాము ఆప్కాస్‌లో ఉన్నప్పటికీ సమాన పనికి సమాన వేతనం ఎందుకివ్వరని అధికారులను, ప్రజా ప్రతినిధులను మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ప్రశ్నిస్తున్నారు. సమాన పనికి సమాన వేతనం రూ.21 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన నిరసన సోమవారం 12వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పరిసరాల శుభ్రతకు పాటు పడుతున్న తమ పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభించడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమదోపిడికి గురవుతున్నామని, కనీస వేతనాలు అడిగితే అధికారులే అనుచితంగా మాట్లాడుతున్నారని వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ పోరాటాలకు మద్దతు తెలిపిన ప్రస్తుత ఎమ్మెల్యే ఇప్పుడు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. 35 మంది కార్మికులకు ఆప్కాస్‌లో ఆరేళ్లుగా పేర్లు నమోదైనా బదిలీ కార్మికులంటూ వేతనాలు సరిగా ఇవ్వడం లేదని తెలిపారు. మిగిలిన కార్మికులతో పాటు పిఎఫ్, ఇఎస్ఐ మినహాయిస్తున్నా వారితో పాటు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జీవరత్నం, వీరకుమార్, నరసింహారావు, నవీన్, కృపారావు, సమాధానం, ఇంద్రయ్య, జె.శ్రీను, దేవదానం, వీరయ్య, రాజు, ఖాదర్‌బాషా, సాంబయ్య, జగన్నాథం, సాల్మన్, నాగరాణి, మల్లేశ్వరి, వీరమ్మ, లత, నాగమణి, సెల్మి పాల్గొన్నారు.

మహిళా ఉద్యమానికి స్ఫూర్తి ఉదయం

ఐద్వా ఆధ్వర్యంలో మోటూరు ఉదయంకు ఘన నివాళులు

ప్రజాశక్తి-సత్తెనపల్లి

మహిళా ఉద్యమానికి మోటూరు ఉదయం స్ఫూర్తిదాయకమని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమశ్రీ అన్నారు. స్థానిక పుతుంబాక భవన్‌లో సోమవారం జరిగిన మోటూరు ఉదయం వర్థంతి సభకు ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి జి.రజని అధ్యక్షత వహించారు. ఉమశ్రీ మాట్లాడుతూ గుంటురు జిల్లా కమ్మవారిపాలెంలో 1924లో అక్టోబరు 13న సంపన్న రైతు కుటుంబంలో జన్మించిన మోటూరు ఉదయంకు బాల్యం నుండి పాటలు పాడటమన్నా నాటికలో నటించటమన్నా చాలా ఇష్టమని చెప్పారు. మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా బాధితులకు అండగా నిలిచేవారన్నారు. అప్పట్లో సినీదర్శకులు ఆమెను స్ఫూర్తిగా తీసుకుని పాత్రలనూ సృషించారని అన్నారు. ఆమె ఇద్దరు కుమార్తెలనూ ఉద్యమకారులుగానే తీర్చిదిద్దారని, 2002లో మరణించారని తెలిపారు. తొలుత ఉదయం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా నాయకులు డి.విమల, టి.లక్ష్మి, కె.రమాదేవి, ఐ.అరుణ, కె.సుధా, ఎం.భారతి, స్పందన, సాయి, బిందు, ప్రజాసంఘాల నాయకులు కె.శివ దుర్గారావు, ఆంజనేయులు, షేక్ మస్తాన్‌లి పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై నమాజ్‌లో ముస్లిముల నిరసన

వక్ఫ్ సవరణ బిల్లుపై మంగళగిరిలోనిరసన తెలియజేస్తున్న ముస్లిం మహిళలు

వక్ఫ్ సవరణ బిల్లుపై దుగ్గిరాలలో నిరసన తెలుపుతున్న ముస్లిములు

ప్రజాశక్తి - మంగళగిరి

రంజాన్ సందర్భంగా సోమవారం మంగళగిరిలోని అరవింద మోడల్ స్కూల్‌లో అన్వరీ ఇస్లామిక్ సెంటర్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించబడింది. ఈ నమాజులో మహిళలు, పురుషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇమామ్ రమజాన్ ప్రాముఖ్యతను తెలియజేస్తూ రమజాన్ ముస్లింలకు అత్యంత పవిత్రమైన నెల అని, ఇది ఖుర్‌ఆన్ అవతరించిన నెల అని, దీనిని ఉపవాసం, ఖుర్‌ఆన్ పఠనం, ప్రత్యేక ప్రార్థనలు, ధార్మిక సేవలు, మరియు దానధర్మాలతో జరుపుకుంటారని తెలిపారు. సాధారణంగా రమజాన్ ఈద్ ముస్లింలకు పరమానందాన్ని అందించే పండుగ అయినప్పటికీ, వక్ఫ్ సవరణ బిల్లుతో ఈ సంవత్సరం దానిని సంతృప్తిగా జరుపుకోలేకపోతున్నామని నమాజుకు వచ్చిన ముస్లింలు ఆవేదన వెల్లిబుచ్చారు. ఈద్ నమాజ్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని, వక్ఫ్ సవరణ బిల్లుపై తమ అసంతప్తిని వ్యక్తం చేశారు. వారు ప్లకార్డులు ప్రదర్శించి తమ శాంతియుత నిరసన తెలియజేశారు. పురుషులు నల్ల రిబ్బన్లు కట్టుకొని ప్లకార్డులతో వక్ఫ్ బిల్లును వ్యతిరేకిస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ బిల్లుతో ముస్లింల హక్కులకు, ప్రార్థనాలయాలకు , వక్ఫ్ ఆస్తుల భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, ముస్లింల మనోభావాలను గౌరవించి, ఈ బిల్లుకు మద్దతు ఇవ్వకుండా న్యాయం చేయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, మంగళగిరి ఎమ్మెల్యే, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కోరారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల వ్యాప్తంగా ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ప్రభుత్వానికి నిరసన తెలియజేస్తూ సోమవారం రంజాన్ పండుగను జరుపుకున్నారు. కఠోర ఉపవాస దీక్ష అనంతరం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న చట్టానికి నిరసన తెలియజేస్తూ చేతులకునల్లరిబ్బన్ లు కట్టుకొని నిరసన తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ముస్లిం సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తుందని విమర్శించారు. మండల కేంద్రం దుగ్గిరాలతో పాటు పెనుమూలి కంఠంరాజు కొండూరు చిలువూరు తుమ్మపూడి రేవేంద్రపాడు గ్రామాల్లో ఈద్ ప్రార్థనలు జరిగాయి.

తెనాలిలో నమాజు వద్ద ఎమ్మెల్సీ ఆలపాటికి వినతి పత్రం ఇస్తున్న ముస్లింలు

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ఆలపాటి, ధూళిపాళ్ల

ప్రజాశక్తి - తెనాలి

రంజాన్ సందర్భంగా పట్టణంలో పలు మసీదులలో జరిగిన ప్రార్థనలలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మజ్లిసుల్ ఉలామా వల్ అయిమా, జమియతే ఉలామా హింద్ సంస్థల ప్రతినిధులు వక్ఫ్ 2024 చట్ట సవరణను వ్యతిరేకిస్తూ నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీకి వినతి పత్రం సమర్పించారు. చట్ట సవరణతో వారు ఎదుర్కొనే ఇబ్బందులను వివరించారు. దీనిపై ఎమ్మెల్సీ స్పందిస్తూ కూటమి ప్రభుత్వం ముస్లింలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు, పాల్గొన్నారు.

ప్రజాశక్తి చేబ్రోలు : పవిత్ర రంజాన్ పర్వదిన సందర్భంగా పొన్నూరు పట్టణం ఇటికంపాడు రోడ్డులో గల ఈద్గానందు ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ఎ పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ —ల్గొని అందరికీ ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి కృషి చేస్తామని, దానిలో భాగంగానే పొన్నూరులో షాది ఖానా ఏర్పాటు , 22 ఏ క్రింద ఉన్న భూములు విడుదల, మోజాములు, ఇమాములకు గౌరవ వేతనాలు వచ్చేలా చేశామన్నారు.

పొన్నూరులో నమాజులో పాల్గొన్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

ఆటో బోల్తా పడి డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - మాచర్ల

మాచర్ల మండలం బికెవి చెంచుకాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పోగుల మణిరాజు (35) సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. బికెవిపాలెం నుండి అలుగు రాజుపల్లె వద్ద పొలాలకు వ్యవసాయ కూలీలను తన ఆటోలో తీసుకెళ్ళిన మణిరాజు మధ్యాహ్నం పూట తిరిగి వారిని పొలాల నుండి ఇంటికి తెచ్చేందుకు వెళుతుండగా అలుగు రాజుపల్లె వద్ద ఆటో అదుపు తప్పి రాయిని ఢీకొన్నది. ఆటోలో నుండి క్రింద పడిన మణిరాజు తలకు రాయి కొట్టుకోవటంతో తలకు బలమైన గాయమైనది. దీంతో మణిరాజు సంఘటన స్థలంలోనే మరణించాడు. ఆటోలోనే ఉన్న తాటి ఆంజికి స్వల్ప గాయాలైనాయి. విజయపురిసౌత్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మణిరాజుకి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

మహిళను వేధించిన గుర్తుతెలియని వ్యక్తి హత్య

ప్రజాశక్తి- తాడేపల్లి

గత నెల రెండో తేదీ తాడేపల్లి పట్టణంలోని కేంద్రం కాలనీ హోసన్న మందిరం వద్ద గుర్తు తెలియని వ్యక్తిని స్థానికులు కొట్టి చంపేశారని మంగళగిరి డిఎస్పి మురళీకృష్ణ తెలిపారు. సోమవారం తాడేపల్లి పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హోసన్న మందిరం పక్కనే గల దుర్గాసి రాజేశ్వరి అనే మహిళ ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తి వెళ్ళాడు. ఆమె పట్ల సభ్యంగా ప్రవర్తించాడు. ఆ పెద్దగా కేకలు పెట్టుకుంటూ చుట్టుపక్కల వారు పోగారు. వాళ్ళను చూసి భయంతో ఆ వ్యక్తి కొండపైకి పరుగులు తీశాడు. స్థానికులు కూడా వెంటాడి అతను తీవ్రంగా గాయపరిచి చంపేశారు. మృతదేహాన్ని కొండపై నుంచి కిందకు తెచ్చి హోసన్న మందిరం పక్కనే పడేశారు. ఈ ఘటనలో ఆరుగురు పాల్గొన్నట్టు పోలీసులు విచారణలో తేలింది. ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు డిఎస్పి తెలిపారు. మిగతా ముగ్గురిని కూడా త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. విలేకరుల సమావేశంలో సీఐ బి కళ్యాణ్ రాజు, ఎస్సై ఎస్ కే ఖాజావలి తదితరులు పాల్గొన్నారు.

చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని 75 తాళ్లూరు గ్రామానికి చెందిన సూరేపల్లి లక్ష్మీనరసింహారావు తన ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. గుంటూరులో నివాసముంటు తాళ్లూరులోని ఇంటికి మరమ్మతులు చేయించడానికి సోమవారం వచ్చినట్లు తెలిపారు. ఇంటి తాళం తీసి ఉండటం ఇంట్లోని వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయని, ఇంట్లోని సామాన్లు పోయినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నలుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు గ్రామంలోని పాల కేంద్రం వద్ద జూదమాడుతున్న వారి నుండి రూ. 1720 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గిరిబాబు తెలిపారు. సోమవారం పేకాట ఆడుతున్నారని సమాచారం రాగా తన సిబ్బందిని వెంటబెట్టుకుని వెళ్ళగా అక్కడ నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించగా వారందరినీ అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి నగదు, 52 పేక ముక్కలను స్వాధీన పరుచుకుని వారిపై కేసు నమోదు చేశామన్నారు.

మాట్లాడుతున్న కేశన శంకరరావు

బీసీల అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలి

ప్రజాశక్తి - మంగళగిరి

బీసీ సమాజ అభ్యున్నతి కోసం ఉద్యోగులు కృషి చేయాలని,అందుకు "పే బ్యాక్ టు ద సొసైటీ" నియమాన్ని ప్రతి ఒక్కరూ అమలు పరచాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు. సోమవారం మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆ విభాగ రాష్ట్ర అధ్యక్షులుగా ఎం వి వి ఎస్ ఎన్ మూర్తి నియామకమైన సందర్భంగా అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా కేసన మాట్లాడుతూ, నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మూర్తి అనేక దశాబ్దాలుగా ఉద్యోగులను ఐక్యపరుస్తూ, వారి సమస్యలపై అనేక ఉద్యమాలు-పోరాటాలు నిర్వహించారన్నారు. ముఖ్యంగా మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ప్రజల సమస్యల పైన సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తిగా భవిష్యత్తులో ఉద్యోగ విభాగాన్ని మరింత బలోపేతం చేస్తారన్నారు. ఏప్రిల్ 4న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరం పక్కనున్న టీటీడీ కళ్యాణ మండపంలో జరుగు రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని బీసీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతి కుమార్ మాట్లాడుతూ, బీసీల ప్రధాన డిమాండ్లపై ఏప్రిల్ 2న" హలో బిసి-చలో ఢిల్లీ" కార్యక్రమం, ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరుగు భారీ నిరసన ధర్నాను జయప్రదం చేసేందుకు బీసీలంతా తరలి రావాల్సిందిగా కోరారు. రాష్ట్ర ఉద్యోగ విభాగ అధ్యక్షునిగా ఎంపికైన మూర్తి మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం అభివృద్ధికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు, సంఘ బలోపేతానికి అంకితభావంతో-చిత్తశుద్ధితో కృషి చేస్తానని వాగ్దానం చేశారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కె శివరాం బాబాజీ, రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, ఉద్యోగ విభాగ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు జంజన వరప్రసాద్, విశ్వేశ్వరరావు, వెంకట్రావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

పంచకర్మ టెక్నీషియన్ కోర్సును ప్రారంభించిన మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి - గుంటూరు

స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు పొత్తూరులోని వైద్యశాల ప్రాంగణంలో నిర్వహించారు. కార్యక్రమానికి వైద్యశాల వ్యవస్థాపకులు డాక్టర్ కె.శివరామ గోపాలన్ అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, లైవ్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ వి.జయప్రకాశ్ నారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కింద పంచకర్మ టెక్నీషియన్ కోర్సును మంత్రి ప్రారంభించి మాట్లాడారు. ఆదాయం తక్కువ వచ్చే ఆయుర్వేదం ఆసుపత్రి పెట్టడం, ఈ స్థాయికి తేవడం గొప్ప విషయమన్నారు. ఆయుర్వేదం అంటే కేరళ రాష్ట్రమే గుర్తుకు వస్తుందని, అయితే నేడు ఇక్కడా అద్భుతమైన చికిత్సలు గర్వకారణమని అన్నారు. ఆయుర్వేద ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఆల్కహాల్ డీ ఎడిక్షన్ సెంటర్ కూడా ప్రారంభించి మద్యం బారిన పడిన వారిని కాపాడాలని కోరారు. ఆయుర్వేద వైద్యంపై ప్రభుత్వం ప్రాధాన్యతం పెరగాలని, కొత్త ఆస్పత్రులు పెట్టాలని కోరారు. స్నిగ్ధ ఆస్పత్రి వ్యవస్థాపకులు, చీఫ్ ఫిజిషన్ డాక్టర్ కెఎస్ఆర్ గోపాలన్ మాట్లాడుతూ గుంటూరు అరండల్‌పేటలో తొలుత ప్రారంభించి క్రమంగా నాలుగు శాఖలుగా విస్తరింప జేసి తెలుగు రాష్ట్రాలలో మొట్టమొదటిగా 126 పడకలతో మల్టీ స్పెషాలిటీ విభాగం ప్రారంభించామని చెప్పారు. క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా ద్వారా ఎన్ఎబిహెచ్ అక్రిడేషన్ పొంది మొట్టమొదటి ఇన్సూరెన్స్ సౌకర్యం గల ఆయుర్వేద వైద్యశాలగా సేవలందించుచున్నామని వివరించారు. ఆస్పత్రిలో అందించే సేవలను వివరించారు. నిష్ణాతులైన పంచకర్మ నర్సింగ్ వారిని తయారు చేయడం కోసం టెక్నీషియన్ కోర్సును ప్రారంభించినట్లు చెప్పారు. స్నిగ్ధ ఆయుర్వేదిక్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం గురించి అవగాహన లేక కొంత, ఖర్చుతో కూడుకున్నది అనే భావనతో మరికొంతమంది ఆయుర్వే వైద్యానికి దూరంగా ఉన్నారని చెప్పారు. అందుకే రాయితీపై వైద్యం, చికిత్స, మందులు అందిస్తున్నట్లు వివరించారు. ఉచిత వైద్యశిబిరాలూ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమానంద్, డాక్టర్ విజయభాస్కర్ డాక్టర్ సాయిసుధాకర్, మన్నవ రాధాకృష్ణమూర్తి, హిమసాగర చంద్రమూర్తి, కెఎస్ఆర్ కుటుంబరావ పాల్గొన్నారు.

పంచకర్మ టెక్నిషియన్ కోర్సును ప్రారంభించిన మంత్రి

ధన్యజీవి మాలకొండ రెడ్డి

ప్రజాశక్తి- తాడేపల్లి

తాడేపల్లి సుందరయ్య నగర్ ప్రాంతంలో పేదల ఇళ్ల నివాసం ఏర్పాట్లు కీలక భూమిక పోషించిన ధన్యజీవి మాలకొండ రెడ్డి అని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకర్ నివాళులర్పించారు. మాలకొండ రెడ్డి వర్ధంతి సందర్భంగా సుందరయ్య నగర్‌లోని ఆయన స్తూపం వద్ద సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాలకొండ రెడ్డి చిత్రపటానికి సీనియర్ నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. శివశంకర్‌రావు మాట్లాడుతూ సిపిఎం అభివృద్ధిని చూసి ఓర్వ లేక కాంగ్రెస్ గూండాలు మాల కొండ రెడ్డిని హత్య చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తులను హత్య చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగిపోవని చెప్పారు. సీనియర్ నాయకులు దొంత రెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందు నిలబడి పని చేశారని చెప్పారు. సుందరయ్య నగర్ కట్ట రోడ్డు అభివృద్ధిలో ఆయన పాత్ర ఉందన్నారు. ఉర్దూ పాఠశాలకు తన స్థలాన్ని ఇచ్చి విద్యాభివృద్ధికి తోడ్పడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.జగన్, ఎస్ వెంకటరావు, బూరుగ వెంకటేశ్వర్లు, దొంత రెడ్డి శ్రీనివాస కుమారి, కొట్టే కరుణాకర్ రావు, గాదె సుబ్బారెడ్డి, వేముల దుర్గారావు, నారిన నాగేశ్వరరావు కే మేరీ, ఎస్ గిరిజ, దర్శనపు విజయ్ బాబు, ఎల్ సత్య , విశాస్త్రి, వెంకన్న, ప్రభాకర్, కొండబాబు, వి సామేలు, పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు జొన్నా శివశంకర్

మహారాజశ్రీ సత్తెనపల్లి ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి
(జూనియర్ డివిజన్) వారి కోర్టులో
ఓ.యస్.నెం. 287/2024

బిట్వీన్ :
వజ్రాల శ్రీనివాసరెడ్డి ....వాది
అండ్
చదలవాడ రామకృష్ణ ... ప్రతివాది

టు,
చదలవాడ రామకృష్ణ, తండ్రి ఉపేంద్రరావు, వృత్తి : వ్యవసాయం, నివాసం : మందపాడు గ్రామం, మేడికొండూరు మండలం, గుంటూరుజిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.

పై నెంబరు గల దావాలో శ్రీ కోర్టు వారు ఎదుట మీ యొక్క హాజరు నిమిత్తం ది. 10-4-2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున సదరు వాయిదా తేదీన పై తెలిపిన కోర్టులో ఉదయం 10-30 గం.లకు స్వయంగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ హాజరయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొన వలయును. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించ బడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వాయిదాతేది : 10-4-2025

బి.ఎల్.చిన్నయ్య,
వాది తరఫు న్యాయవాది,
సత్తెనపల్లి. సెల్ : 9848771757

సర్కిల్ సిఐ కిరణ్ కుమార్, రూరల్ సిఐ ఎంవి సుబ్బారావు

విధుల్లోకి నూతన సిఐలు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సర్కిల్ సిఐగా పి.కిరణ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గుంటూరు దిశ పోలీస్ స్టేషన్లో సిఐగా పని చేస్తూ సత్తెనపల్లి సర్కిల్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన సిఐని సర్కిల్ పరిధిలోని ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు ఎస్ఐలు సోమేశ్వరరావు, వేణుగోపాల్, సిహెచ్ సురేష్ కలిసి శుభాకాక్షంలు తెలిపారు. ఇదిలా ఉండగా సత్తెనపల్లి రూరల్ సిఐగా ఎంవి సుబ్బారావు బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకూ ఇక్కడ పనిచేసిన పి.శ్రీనివాసరావు విఆర్‌కు వెళ్లారు. నూతన సిఐ సుబ్బారావు గతంలో నర్సరావుపేట, పాతగుంటూరు, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, గురుజాల, పోలీస్ స్టేషన్లో సిఐగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల అదుపునకు రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేస్తామని, అసాంఘిక కార్యకాలపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీ హనుమంతరావును కలిశారు.

విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధిగమించిన టైల్‌పాండ్ ప్రాజెక్ట్

ప్రజాశక్తి - రెంటచింతల : మండలంలోని సత్రశాల వద్ద కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జున సాగర్ టైల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో 2025 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి గాను విద్యుత్ ఉత్పత్తిలో లక్ష్యాన్ని అధికమించినట్లు ప్రాజెక్టు ఎస్ఇ వెంకటరమణ సోమవారం తెలిపారు. గతేడాది వర్షాలు అధికంగా పడడం వల్ల నాగార్జున సాగర్ ప్రాజెక్టులోనికి అధిక మొత్తంలో నీరు రావడం వల్ల ఈ ఉత్పత్తి సాధ్యమైనట్లు చెప్పారు. మార్చి 31 నాటికి 78 ఎంయుల (మిలియన్ యూనిట్లు) విద్యుత్తును తయారు చేయాల్సి ఉండగా 92.4279 ఎంయుల విద్యుత్తును రెండు యూనిట్లు ద్వారా ఉత్పత్తి చేశామన్నారు 2017 జనవరి 9న ఈ ప్రాజెక్టులో తొలిసారిగా విద్యుత్ తయారు కాగా ఇప్పటివరకు 566.332 ఎంయుల విద్యుత్ ఉత్పత్తయినట్లు తెలిపారు. సమావేశంలో జిఎం శ్రీనివాస్ ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు, రత్తయ్య, మల్లేష్ సుబ్బారావు పాల్గొన్నారు.

54 శాతం పన్ను వసూలు

ప్రజాశక్తి - మాచర్ల

ఇంటి, నీటి, ఖాళీ స్థలాల పన్నుల వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వటంతో మాచర్ల మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక బిల్ కౌంటర్లను ఏర్పాటు చేసి అర్థరాత్రి 12 గంటల వరకు బిల్లులు కట్టించుకున్నారు. కౌంటర్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు మాట్లాడుతూ 1-4-2024 నుంచి 31-3-2025 వరకు మాచర్ల మున్సిపాలిటీకి పన్నుల రూపంలో రూ.ఏడున్నర కోట్లు రావాల్సి ఉండగా రూ.4.3 కోట్లు వచ్చినట్లు చెప్పారు. ఎల్సికె సిమెంట్ ఫ్యాక్టరీ, నీలిమ థియేటర్, అద్దాలమేడ నుంచి సుమారు రూ.కోటి వరకు పన్ను బాకీలు రావాల్సి ఉందన్నారు. గతేడాది 28 శాతం వసూలు కాగా ఈ ఏడాది 54 శాతం వసూలైందన్నారు. నూరుశాతం పన్ను వసూలుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

బండిని బయట పెట్టాలంటే దడ

- మాచర్ల పట్టణంలో పట్టపగలే దొంగలు హల్‌చల్
- ద్విచక్రవాహన చోరీలతో బెంబేలెత్తుతున్న జనం
- ఇనుప గొలుసులతో వాహనాలకు తాళాలు వేసుకొంటున్న యజమానులు

దొంగల భయంతో ఇంటి ముందు నిలిపిన స్కూటర్‌ను ఇనుప గొలుసుతో కట్టి తాళం వేసిన యజమాని



యూనికాన్ బైక్‌ను దొంగిలించి తీసుకుపోతున్న గుర్తుతెలియని వ్యక్తి సిసి కెమెరాలోని దృశ్యం

ప్రజాశక్తి - మాచర్ల

రాత్రి వేళల్లో, జన సంచారం లేని సమయాల్లో, ఎవరూ చూడకుండా దొంగలు చోరీలకు పాల్పడుతుంటారనేది అందరికీ తెలిసిందే. కానీ మాచర్ల పట్టణంలో మాత్రం పట్టపగలే, జనరద్దీ ప్రాంతాల్లోనే రెచ్చిపోతున్నారు. వ్యాపార సముదాయాలు, రోడ్ల వెంట, ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ద్విచక్రవాహనాలను చిటికెలో మాయం చేస్తున్నారు. దొంగిలించిన వాహనాలను గంటల వ్యవధిలోనే పట్టణం దాటిస్తూ, విడి భాగాలుగా చేసి నామరూపాలు లేకుండా చేస్తూ బాధితులకు చుక్కలు చూపిస్తున్నారు. ఎంతో కాలంగా మాచర్ల పట్టణంలో ద్విచక్రవాహన చోరులు హవా నడుస్తోంది. బుధవారం సాయంత్రం పట్టణంలోని ప్రధాన కూడలి అంబేద్కర్ సెంటర్‌లోని ఓ వైన్సు మందు శ్రీను అనే వ్యక్తి ఏపి07 సిజె 4184 నెంబర్‌గల హీరో హోండా గ్లామర్ బండి నిలిపి పనిచూసుకొని వచేసరికి బైకు కనిపించకుండా పోయింది. ఇలా వ్యాపార సదుదాయల ముందు వాహనాలు తరుచూ చోరీకి గురవుతున్నాయి.

పట్టణంలో పార్కింగ్ సదుపాయం లేని చిన్నచిన్న గృహాలు అధికంగా ఉండటంతో తమ వాహనాలను ఇంటి ముందే రోడ్డుపైన నిలుపుతుండగా వాటిని దొంగలు సులభంగా చోరీ చేస్తున్నారు. బైక్ దొంగలను ఎన్నిసార్లు పట్టుకున్నా చోరీలు మాత్రం యథావిదిగా జరుగుతూనే ఉన్నాయి. వారం క్రితం 15వ వార్డు శ్రీచైతన్య స్కూల్ బజార్‌లో నివాసముండే సూరేపల్లి లక్ష్మీనారాయణ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంటి ముందు యూనికాన్ బైక్‌ను నిలిపి, ఇంట్లోకి పోయి వచ్చే సరికి వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లారు. సమీపంలోని సిపి కెమెరాల ఫుటేజీని పరిశీలించగా అగంతకుడు ద్విచక్ర వాహనాన్ని తీసుకుపోతున్నట్లు రికార్డు అయింది. ఆ ఫుటేజీతో బాధితుడు పోలీసులకు సమాచారం అందించాడు. అతనే స్వయంగా పోయిన ద్విచక్ర వాహనం గురించి పలువుర్ని విచారిస్తుండగా నాలుగు రోజులకు ఒక వాహనం ఊరిబైట చెట్లలో ఉందని సమాచారం అందింది. దాంతో అతను అక్కడికి వెళ్లి చూడగా కొన్ని పార్టులు తొలగించిబడి వున్న తన బైక్ కనపడింది. బైక్‌ను తెచ్చుకొని రూ.15 వేలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించుకున్నాడు. ఇదే వార్డులో మూడు నెలల క్రితం రామారావు బైక్ పోయింది. ఆ బైక్ ఆచూకి ఇంకా లభ్యమవలేదు.

ఈ ప్రాంతంలోనే నివాసముండే నరసింహారావుకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించి బైక్‌ను నడిపించుకుంటూ తీసుకెళ్తుండగా, ఒకతనికి అనుమానం వచ్చి వారిని ప్రశ్నించటంతో వారు బైక్‌ను అక్కడే వదిలి పారిపోయారు. పాత బజారులో పీర్లచావిడి వద్ద మరో బైక్ పోయింది. మాచర్ల చుట్టు పక్కల ప్రాంతాల వారు రైల్వే స్టేషన్ వద్ద తమ ద్విచక్రవాహనాలను ఉదయం పార్కింగ్ చేసి రైలు ప్రయాణం చేసి సాయంత్రం వచ్చే సరికే బైక్‌లను దొంగిలిస్తున్నారు. పట్టణంలో సైకిళ్ల దొంగతనాలు కూడా అధికంగానే జరుగుతున్నాయి. ఇలా కొద్దికాలంలోనే పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనాలు దొంగిలించబడ్డాయి. దీంతోపాటు రైల్వేస్టేషన్, ఇళ్ల ముందు పార్కిగ్ చేసిన ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను కూడా కాజేస్తున్నారు. ఇలా పట్టపగలే దొంగలు రెచ్చిపోతుండటంతో పట్టణ ప్రజలు హడలిపోతున్నారు. కొందరు ఇంటి ముందు నిలిపిన తమ ద్విచక్ర వాహనాలకు ఇనుప గొలుసులతో కట్టి తాళం వేసుకుంటున్నారు. ఇప్పటికైనా పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకొని బైక్ దొంగలను పట్టుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

పేట.. తాగునీటికి కటకట

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రతి ఇంటికీ నెలకు రూ.100 చొప్పున నీటి పన్ను వసూలు చేస్తున్నా నీరు మాత్రం ఏళ్ల తరబడి సరఫరా కావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో వారం పదిరోజులకోసారి సరఫరా చేసున్నారు. ఆ నీరూ దుర్వాసన వస్తోంది. ఎన్‌టిఆర్ సుజల పథకం ద్వారా 20 లీటర్లను రూ.2కు అమ్ముతామని చెప్పినా అదీ సరిగా అమలు కావడం లేదు. ఈ నేపథ్యంలో తాము తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వేసవిలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని పట్టణ ప్రజలు వాపోతున్నారు. మరోవైపు వివిధ పనుల నమిత్తం పట్టణానికి వచ్చేవారు నీరు తాగాలంటే ఎక్కడా కుళాయి కనిపించడం లేదు. దుకాణాల్లో డబ్బులు పెట్టి కొనుక్కుని గొంతు తడుపుకోవాల్సిందే. ఈ నేపథ్యంలో నీటి ధరలనూ పెంచారు. 250 మిల్లీలీటర్ల నీటిని రూపాయికి విక్రయించగా ఇప్పుడు 200 మిల్లీలీటర్లను రూ.2కు అమ్ముతున్నారు. 20 లీటర్ల క్యాన్‌ను రూ.10, కూలింగ్ పెట్టిన 15 లీటర్ల క్యాన్ అయితే రూ.20కు అమ్ముతున్నారు. కొంతమంది ఆటోల్లో నీటిని తెచ్చి బిందె రూ.15 చొప్పున అమ్ముతున్నారు.

పట్టణంలో 38 వార్డులుండగా 60 నుంచి 70 వేల గృహాలు, 1.80 లక్షల మంది జనాభా ఉన్నారు. గ్రేడ్-1 మున్సిపాల్టీ అయినా ప్రజలకు మాత్రం తాగునీరు సమకూర్చలేకపోతోంది. దీంతో జనం చిన్నచిన్న వాహనాల్లో వీధుల్లో తిరుగుతూ నీరు అమ్మే వాహనాల కోసం ఉదయాన్నే ఎదురు చూడాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా అనుమతులు లేకుండా ఎక్కడబడితే అక్కడ మినరల్ వాటర్ పేరుతో ప్లాంట్లు పెరుగుతున్నారు. నిర్వహణ సరిగా లేకపోవడంతో క్యాన్లలో ఫంగస్ చేరుతోంది. అయినా పట్టించుకునేవారు లేరు.

పనిచేయని ఆర్వో ప్లాంట్

విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న అతిథులు

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-ముప్పాళ్ల

క్రీడాల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు, శారీరక ధృడత్వం వస్తుందని, అది ఆరోగ్యానికి మంచిదని టిడిపి నాయకులు దరువూరి నాగేశ్వరరావు, అనన్య హాస్పిటల్ అధినేత సింగరాజు సాయికృష్ణ అన్నారు. రంజాన్ సందర్భంగా ముప్పాళ్లలోని జెడ్‌పి హైస్కూల్‌లో ముప్పాళ్ల ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనుషుల మధ్య స్నేహ భావం పెంపొందడానికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ప్రతిరోజూ మన జీవన శైలిలో క్రీడలను భాగం చేసుకుంటే మంచి వ్యాయామంగానూ ఉపకరిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు బత్తుల నాగేశ్వరరావు, నాయకులు రావిపాటి మధుబాబు, భాను ప్రసాద్, గంగారం కాశీం, యల్లమంద, స్పాన్సర్‌లు అత్తోట కృష్ణ, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, ఆర్గనైజర్లు షేక్ మాబు సుభాని, కొప్పరం జిలానీ, మౌలాలి పాల్గొన్నారు.

సర్వేలతో అధికారుల కాలయాపన

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ 20 వేలు - తర్వాత ఇస్తామన్నది 5600

పేదలకు ఇళ్లపట్టాలు, ఇళ్లస్థలాలు ఇవ్వాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు మంత్రి నారాలోకేష్ దాదాపు 20వేల మంది లబ్దిదారులకు ఇళ్లపట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, ఎన్నికల తరువాత 5600 మందికి ఇస్తామని అవి కూడా ఇంతవరకు ఇవ్వలేదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు పాశం రామారావు విమర్శించారు. టిడిపి కూటమి ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని, మంగళగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ భూముల్లో ఇళ్లు వేసుకొని నివాసముంటున్న పేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని పాశం రామారావు డిమాండ్‌చేశారు. సోమవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో సిపిఎం పట్టణ విస్తృత సమావేశం సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతు సూపర్ సిక్స్ పథకాలలో ప్రతి మహిళకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, ఆర్టీసీలో మహిళలకు ఉచితంగా ప్రయాణం, ఫీజు రియింబర్స్‌మెంట్, తల్లికి దీవెన వంటి హామీలను ఇంతవరకు అమలు జరపలేదని విమర్శించారు. త ఈ పథకాలు ఎప్పటినుండి అమల చేస్తామనేది కూడా కూటమి ప్రభుత్వం చెప్పడం లేదన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా పేదలకు ఇళ్లకు పట్టాలిస్తామని శిలాఫలకాన్ని కూడా వేయడం జరిగిందని అన్నారు. పది నెలలు కావస్తున్నా ఇంత

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

వరకు పట్టాలు ఇవ్వలేదని, ఇటీవల 5600 మందికి పట్టాలిస్తామని చెప్పి అవి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అధికారులు ఇంకా ఎంతకాలం సర్వేలు చేస్తారని ప్రశ్నించారు. వెంటనే వారందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని, ఇళ్ల స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ మాట్లాడుతూ ఇటీవల సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజా చైతన్య యాత్రలను నిర్వహించామని చెప్పారు. ఈ సందర్భంగా ప్రజల నుండి అనేక సమస్యలు వచ్చాయని, ఆ సమస్యలను పరిష్కరించాలని గత నెల 25వ తేదీన ధర్నా చేసి, కార్పొరేషన్ అధికారులకు, తహశీల్దార్‌కు వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అన్నారు. అదేవిధంగా ఇళ్ల పట్టాలు ఇస్తానని చెప్పి, ఇంతవరకు ఇవ్వలేదని వీటిపై ప్రజలను సమీకరించి ఉద్యమిస్తామని చెప్పారు. పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం బాలాజీ, వై కమలాకర్, పాల్గొన్నారు.

'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు'

సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికీ వాల్ స్టిక్కర్లు పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మా ఇంటికి స్మార్ట్ మీటర్ వద్దు. కరెంట్ చార్జీలు తగ్గించాలని ఆత్మకూరు సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటికి ప్రచారం చేస్తూ స్మార్ట్ మీటర్ల వాళ్ళ గృహ వినియోగదారులకు ఏ విధంగా నష్టపోతారో అనేది తెలియజేస్తూ ఇంటింటికి వాల్ స్టిక్కర్లను సిపిఎం నాయకులు అంటించారు. ఈ సందర్భంగా సిపిఎం రూరల్ మండల కార్యదర్శి వుద్దంటి దుర్గారావు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణలో భాగంగా అదానీ కి లాభాలు చేకూర్చడం కోసం రాష్ట్ర ప్రజల మీద స్మార్ట్ మీటర్ భారాన్ని రుద్దుతున్నారని ఈ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ముందుగానే రీఛార్జ్ చేయించుకోవాలని విద్యుత్ ఎక్కువగా వినియోగించే సమయాల్లో అధిక రేట్లతో ముందుగానే రీచార్జ్ చేయించుకున్న డబ్బులు కట్ అయ్యి సామాన్యుల జేబుకి చిల్లులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పుడు ప్రస్తుతం పని చేస్తున్న డిజిటల్ మీటర్లు బాగానే పనిచేస్తుండగా రూ. ఐదువేల ఖరీదు చేసే స్మార్ట్ మీటర్లను రూ. పదివేల రెండువందల అధిక రేట్లతో కొని ఆదానీకి లాభాలు చేకూర్చడానికి తప్ప ప్రజలకు ఎందుకు ఉపయోగపడదని తెలిపారు. గత జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను వ్యవసాయ పంపుసెట్లకు అమర్చినప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించి స్మార్ట్ మీటర్లను పగలగొట్టండి అన్న కూటమి నాయకులు ఈరోజు అధికారానికి వచ్చిన తర్వాత రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన విధానాలనే అమలు చేస్తూ స్మార్ట్ మీటర్లను వాణిజ్య సముదాయాలకు అమరుస్తున్నారని ఇది భవిష్యత్తులో గృహ వినియోగదారులకు కూడా అమర్చటానికి సిద్ధం చేస్తుందన్నారు. ప్రజలు ఈ స్మార్ట్ మీటర్ల ను వ్యతిరేకించాలని లేనియెడల భవిష్యత్తులో పేదలు విద్యుత్‌కి దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడ్డం అజయ్ కుమార్ చిట్టేల జనార్ధనరావు గౌరబత్తుల లక్ష్మి,కటివరపు లక్ష్మి, మునగాల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి : సిపిఎం రాష్ట్ర కమిటీ ముద్రించిన మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు- పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి డోర్ పోస్టర్‌ను రాజధాని డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఉండవల్లి సెంటర్ సిపిఎం కార్యాలయంలో ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం రాజధాని డివిజన్ కమిటీ కార్యదర్శి ఎం రవి మాట్లాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాల్ని ఈ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందని విమర్శించారు. ప్రజలపై ట్రూ ఆఫ్ మరియు సర్దుబాటు చార్జీల పేరుతో 15 వేల 485 కోట్లు కూటమి ప్రభుత్వం భారవేసిందని మండిపడ్డా రు. ఎలాంటి విచారణ లేకుండా, ప్రజాభిప్రాయం స్వీకరించకుండా భారాలు మోపటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో మరో కొత్త భారం వినియోగదారుల నెత్తిన పడనుందని హెచ్చరించారు. అందుకే స్మార్ట్ మీటర్లు బిగించవద్దని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈమని రామా రావు, టి బక్కి రెడ్డి, ఆర్వి రాఘ వయ్య, కే రామకృష్ణ, పి గాంధీ సైకం వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

118వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : ఏ సి సి మెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావలసిన బకాయిల కోసం చేస్తున్న రిలే దీక్షలు సోమవారం నాటికి 118 రోజుకు చేరు కున్నాయి. ఉగాది మరియు రంజాన్ పండగ రోజు కూడా దీక్షాపరులు తమ దీక్షలను కొనసాగించారు. దీక్షలో బి దానయ్య, ఎన్ సుబ్బారావు, సిహెచ్ పిచ్చయ్య , ఏ రామారావు, బి నవనీతం కూర్చున్నారు, దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు కొరపాటి స్టీవెన్, కే. ఆదినారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరూ సంతోషంగా కొత్త సంవత్సరం ఉగాది సంబరాలు చేసుకుంటుంటే, తాము మాత్రం ప్రభుత్వ చర్యల కోసం ఎదురుచూస్తున్నామని చెప్పారు. న్యాయమైన తన సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం గురవయ్య, టి నాగేశ్వరరావు, వై యెహెూషువ, బి సూర్యప్రకాష్ రావు, వై రమాదేవి, టీ దుర్గ భవాని, ఎం శివ కుమారి, ఈ సారమ్మ, ఏ విజయశ్రీ, డి సువర్చలాదేవి పాల్గొన్నారు.

రమణరావు, కమలవల్లి దంపతుల్ని సత్కరిస్తున్న జస్టిస్ నాగేశ్వరరావు తదితరులు

ఏకాదండయ్య పంతులు సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-గుంటూరు : విద్య, వైద్యం, ఆధ్యాత్మిక, ఆదరణ గృహాలు ద్వారా 8 దశాబ్దాల క్రితం ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవలందించిన కీర్తిశేషులు ఏకాదండయ్య పంతులు జీవితం వర్తమాన, భవిష్యత్ తరాలకు ఆదర్శప్రాయమని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్ఆర్ఎల్ నాగేశ్వరరావు అన్నారు. ఏకాదండయ్య పంతులు చారిటీస్ ఆధ్వర్యంలో స్థానిక హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ సుధర్మ సమావేశ మందిరంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏకాదండయ్య పంతులు బహుముఖ సేవలను కొనియాడారు. అనంతరం ప్రముఖ వైద్యులు వి.రమణరావు కమలవల్లి దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కొండూరి కృష్ణారావు, వర్కింగ్ ట్రస్ట్ కొండూరి నందకిషోర్, ట్రస్టీలు కేఎస్ఆర్ కుటుంబరావు, భట్రాజు కృష్ణ కిషోర్, కేసానుపల్లి వెంకట శ్రీరామ సుబ్బారావు, నెప్పల్లి వరప్రసాద్, పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికులతో మాట్లాడుతున్న చింతల శ్రీనివాసరావు

పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడి వెట్టి చాకిరి చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి వారు ఎటువంటి సౌకర్యం పొందలేకపోతున్నారని జిల్లా గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాసరావు అన్నారు. పంచాయతీ కార్మికులు పి ఎఫ్, ఈ ఎస్ ఐ ప్రమాద బీమ వంటి సౌకర్యాలతో పాటు కనీసం గుర్తింపు కార్డులకు కూడా నోచుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి న్యాయమైన కోరికల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా సంతకాలు సేకరించి ఈ నెల 11వ తేదీన పంచాయతీ శాఖ మంత్రిని కలవనున్నట్లు తెలిపారు. ఆ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సోమవారం మండల కేంద్రం దుగ్గిరాలలో పంచాయతీ కార్మికులను కలిశారు. మండల కార్యదర్శి జి శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు కాకపోగా ఒక్కసారి నాలుగు నుండి 12 నెలలు బకాయి ఉంటున్నారు అన్నారు. సకాలంలో జీతాలు అందించాలని కోరారు. టెండర్ విధానం లేకుండా కార్మికులను కొనసాగించాలన్నారు. అనంతరం కమిటీని ఏర్పాటు చేశారు బి నరసింహారావు అధ్యక్షులుగా ఎం సుబ్బయ్య కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కటారి వెంకటేశ్వరరావు కే రాఘవ మీనా ఎం రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి నుండి పలువురికి ఉగాది పురస్కారాలు



నసీర్ అహ్మద్‌కు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - తాడేపల్లి

బహు గ్రంథ రచయిత, సీనియర్ జర్నలిస్ట్ నసీర్ అహ్మద్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఉగాది పురస్కారం అందజేశారు. నసీర్ అహ్మద్ సరికొత్త పుస్తకం భారత స్వాతంత్రోద్యమం – ఆంధ్ర ముస్లిం యోధులు పుస్తకాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కి ఆయన అందజేశారు. గత 25 సంవత్సరాలుగా తాను కొనసాగిస్తున్న చరిత్ర పుస్తకాల రచన, ప్రచురణ మరియు ప్రసార బాధ్యత కార్యక్రమాలను ముఖ్యమంత్రికి వివరించారు. సావధానంగా విన్న ముఖ్యమంత్రి నసీర్ అహ్మదును అభినందించారు . ప్రముఖ రచయిత నసీర్ అహ్మద్ కు ఉగాది పురస్కారం దక్కటం పట్ల తాడేపల్లికి చెందిన పలువురు ఆయన అభినందనలు తెలిపారు.

కాటూరికి 'కళారత్న'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యున్నత "కళారత్న" పురస్కారాన్ని తెనాలి కి చెందిన ప్రముఖ శిల్పి, సూర్య శిల్పశాల వ్యవస్థాపకులు కాటూరి వెంకటేశ్వరావు అందుకున్నారు. ఆదివారం సీఎం క్యాంపు కార్యాలయంలో

నిర్వహించిన ఉగాది సంబరాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు స్వీకరించినట్లు ఆదివారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా శిల్పకళ రంగంలో అందించిన విశిష్ట కృషికి ఉగాది పర్వదినంనాడు అవార్డు పొందడం ఆనందంగా ఉందని వెంకటేశ్వరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కూడా కాటూరి వెంకటేశ్వరరావు రూపొందించిన శిల్పాలు ప్రదర్శించబడి, విశేష ప్రశంసలు పొందాయి. ఐరన్ స్క్రాప్, ఇతర లోహాలతో విగ్రహాలను రూపొందిస్తూ, శిల్పకళలో వినూత్న ప్రయోగాలు చేసి ప్రత్యేక గుర్తింపు సాధించారు. పలువురు కాటూరికి అభినందనలు తెలిపారు.

హంస పురస్కారం అందుకున్న శ్రీనివాసరావు

ప్రజాశక్తి - తెనాలి

ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన హంస పురస్కారాన్ని తెనాలి ప్రాంతానికి చెందిన ముఖ సాహితీవేత్త, కళాకారుడు మన్నే శ్రీనివాసరావు అందుకున్నారు. ఆదివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు



నాయుడు చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారం కింద రూ.50వేలు నగదు, హంస ప్రతిమను అందుకున్నట్లు శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఎన్నో పురస్కారాలు అందుకున్నప్పటికీ హంస పురస్కారం ప్రత్యేకమని, పైగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా అందుకోవడం ఆనందంగా ఉందని చెప్పారు. హంస పురస్కారం దక్కించుకున్న శ్రీనివాసరావును పలువురు కళాకారులు, సాహితీ ప్రియులు అభినందించారు.

కవి ఆళ్లకు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన కవి, రచయిత ఆళ్ల నాగేశ్వరరావుకు ఉగాది పురస్కారం లభించింది. హైదరాబాదుకు చెందిన తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక వివిధ రంగాలలో కృషి చేసిన వారికి ఉగాది పురస్కారాలను ప్రధానం చేశారు. దానిలో భాగంగా సాహితీ రంగంలో ఆళ్ల నాగేశ్వరరావుకు కూడా వాట్సప్ వేదికగా ఉగాది పురస్కారాన్ని అందించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు పి ఆర్ ఎస్ఎస్ఎన్ మూర్తి, సంస్థ చైర్మన్ డాక్టర్ నారాయణ మూర్తి, పట్టణానికి చెందిన పలువురు సాహితీప్రియులు ఆళ్ళను అభినందించినట్లు చెప్పారు.

పురస్కారం అందుకుంటున్న అశోక్

జర్నలిజం అంటే సేవకు ప్రతిరూపం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజల సమస్యలను వినిపించడం, వాటికి పరి ష్కార మార్గాలను సూచించ డం, అవసరమైతే సహాయం చేయడం ఇవన్నీ జర్నలిస్టు బాధ్యతల్లో భాగమని ఎప్పటి కప్పుడు పేర్కొంటూ, ఆ దిశగా జర్నలిస్టులు ముందు కు రావాలని పిలుపు నిస్తున్న చిలకలూరిపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా, పల్నాడు జిల్లా ఏపీడబ్ల్యూజే కార్గవర్గ సభ్యులు అడపా అశోక్ కుమార్‌కు ఉగాది పండుగను పురస్కరించుకుని పల్నాడు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సేవా పురస్కారం అవార్డు ఆదివారం అందుకున్నారు. ఈ గౌరవాన్ని పొందడం ద్వారా నేడు ఆయన ఎంతో మంది యువ జర్నలిస్టులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నాడు. ఈయన మరెన్నో ఉన్నత శిఖరాలను ఎదగాలని పట్టణంలో పలువురు ప్రముఖులు అభినందించారు.

మీసాల శ్రీనివాసులును సత్కరిస్తున్న యాదవ నాయకులు

మీసాల శ్రీనివాసరావుకి సత్కారం

ప్రజాశక్తి - వినుకొండ

వినకొండ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన న్యాయవాది మీసాల శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో నియోజకవర్గ యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మీసాల శ్రీనివాసరావు సేవలను కొనియాడారు. బార్ అధ్యక్షునిగా యాదవులకు లభించటం అభినందనీయమన్నారు. అంచలంచలుగా ఎదుగుతూ బార్ అధ్యక్షుడిగా ఎన్నికైన మీసాల శ్రీనివాసరావు భవిష్యత్తులో మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడంతో పాటు స్వీట్లు పంచి పూలమాలలు శాలువాలతో సత్కరించి అభినందించారు. మీసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా బాధ్యతగా పనిచేస్తానని తనపై పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని అన్నారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావుల తోపాటు కూటమి నాయకులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సత్కార కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు ఆలా శ్రీనివాసరావు, మద్దుల సత్యనారాయణ, రావుల పల్లి కొండ గురవయ్య(ఆర్.కె), బత్తుల శ్రీనివాసరావు, కన్నెబోయిన వెంకటేశ్వర్లు, శ్రీనివారావు, కిష్టం శ్రీనివాసరావు, నర్రా శ్రీను, శ్రీనివాస్ యాదవ్, బాలకష్ణ, బిఎస్ఎన్ఎల్ కొండలు, శ్రీనివాసరావు యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ రేషన్ డీలర్ మాణిక్యారావు మాస్టర్ మృతి

ప్రజాశక్తి - వినుకొండ

మృతి చెందిన మాణిక్యారావు

మండలంలోని విఠం రాజుపల్లి గ్రామానికి చెందిన దారా మాణిక్యారావు సోమవారం ఉదయం ఆకస్మికంగా మరణించారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌కు బాట వేసిన మాణిక్యరావు మాస్టర్ ఇక లేరు అనే సమాచారం తెలుసుకున్న విద్యార్థులు దు:ఖంలో మునిగిపోయారు. మాణిక్యారావు టీచర్ మాత్రమే కాకుండా అనేక రంగాలలో గుర్తింపు కలిగిన వ్యక్తి. సామాజిక బాధ్యత కలిగిన వ్యక్తిగా జీవించిన వ్యక్తి రాజకీయంగా, దళిత నాయకులుగా, ఏఈయలొసి డెలిగేట్, ప్రస్తుతం రేషన్ డీలర్‌గా అనేక బాధ్యతలను నిర్వహించారు.

ముస్లీం మైనార్టీలకు అండగా నిలుస్తాం

రంజాన్ ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి - మాచర్ల :

రూ.లక్షను విరాళంగా అందిస్తున్న జూలకంటి

ముస్లీంమైనార్టీలకు అన్ని విధాల అండగా నిలుసామని, పేద ముస్లీం మహిళలకు స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మాచర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పేర్కొన్నారు. పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురష్కరించుకుని సోమవారం స్థానిక పాతూరులోని ఈద్గా ప్రాంగణంలో వేలాది మంది ముస్లీం సోదర్లతో కలిసి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు జూలకంటి. అనంతరం మస్జీద్ అభివద్ధికి రంజాన్ కానుకగా తనవంతు రూ.లక్ష నగదును విరాళంగా అందజేసి ముస్లీం సోదర్లకు రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. నూర్ మస్జీద్, షాదీఖానా, కబరస్థాన్ నిర్మాణాలకు ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న జూలకంటి దుర్గాంబ ఎంతో కృషి చేశారని వివరించారు. జమ్మలమడక గ్రామంలో, మండాది రోడ్డు ఎస్కేబీఆర్ కళాశాల వద్ద ఉన్న మస్జీద్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిష్కరించాలని ముస్లీంలు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జూలకంటి ఆ స్థలాలను సర్వే చేసి గుర్తించేలా తక్షణమే తహశీల్దార్‌ను ఆదేశిస్తానని హామీ ఇచ్చారు. ఖబరస్థాన్ చుట్టూ ప్రహరి నిర్మాణానికి ప్రభుత్వ నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈద్గా ప్రాంగణంలో బోరు వేయించి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానని చెప్పారు. చనిపోయిన వారిని తరలించటానికి ప్రత్యేక వాహనంతో పాటు పర్మెనెంట్ డ్రైవర్‌ను, పార్థివ దేహాన్ని భద్రపరిచే ఫీజర్‌ను కూడా అందజేస్తానని మాట ఇచ్చారు. త్వరలో మాచర్లలో ఉన్న ఖబరస్థాన్‌ను సందర్శించి,అక్కడున్న సమస్యలపై గుర్తించి, ప్రణాళికలు సిద్ధం చేసి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముస్లీం మత పెద్దలు, మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి వక్ఫ్ బిల్లుపై అభ్యంతరాలు : చీఫ్ విప్ జీవీ

- రంజాన్ సందర్భంగా ఈద్గా మైదానంలో సామూహిక ప్రార్థనల్లో పాల్గొన్న జీవీ

ముస్లిమ్ సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న జీవీ

ప్రజాశక్తి - వినుకొండ

ముస్లిం సమాజంలో వక్ఫ్ బిల్లు-2025పై నెలకొన్న అభ్యంతరాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దష్టికి తీసుకుని వెళ్తామన్నారు ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి నేరుగా తాను, కేంద్రానికి ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయల ద్వారా ఈ విషయాలను చేరవేస్తామన్నారు. తద్వారా తగిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. వినుకొండలోని తిమ్మాయపాలెం రోడ్‌లోని ఈద్గా మైదానంలో సోమవారం నిర్వహించిన సామూహిక ప్రార్థనల్లో చీఫ్ విప్ జీవీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ముస్లింల సంక్షేమం కోసం కట్టుబడి ఉందన్నారు. ముస్లిం సోదరులకి ఎప్పుడూ తన మద్దతు ఉంటుందన్నారు. తాను 3సార్లు ఎమ్మెల్యేగా గెలవడం, ఇప్పుడు చీఫ్ విప్ కావడంతో వారి సహకారాన్ని ఎప్పుడూ మరిచిపోనన్నారు. స్థానిక ఈద్గా, మర్కజ్ మసీద్ కమిటీ వారు రూ. 40లక్షలు కావాలని అడిగారని... దానిపై మున్సిపాల్టీలో తీర్మానం చేయించి అనుమతులు కూడా తీసుకుమన్నారు. త్వరలో టెండర్లు పిలిచి ఈద్గా ప్రాంతం అభివద్ధి చేస్తా మన్నారు. ఈద్గా అభివద్ధి కోసం సగం ఖర్చును వ్యక్తిగతంగా ఇస్తా అన్నానన్నారు. రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉన్నవారందరికీ అభినందనలు తెలిపారు. ప్రార్థనల అనంతరం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆత్మీయ ఆలింగానాలతో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, కౌన్సిలర్లు,పట్టణ అధ్యక్షులు ఆయుబ్ ఖాన్, షమీంఖాన్, సౌదాగర్ జానీ, గోల్డ్ కరీముల్లా,పీవీ సురేష్ బాబు, మత పెద్దలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వినుకొండ

బాధితులకు సరుకులు అందజేస్తున్న శివశక్తి ఫౌండేషన్

నియోజకవర్గం బొల్లాపల్లి మండలం గరికపాడు, వినుకొండమండలం పెదకంచర్లలో ఇటీవల జరిగిన దుర్ఘటనల్లో అగ్నిప్రమాదాల వల్ల సర్వం కోల్పోయిన కుటుంబాలకు చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు కుటుంబ ఆధ్వర్యంలోని శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ఆపన్న హస్తం అందించింది. ఇళ్లు, ఆస్తులు బూడిదై నష్టపోయిన బాధితులకు ఆర్థిక సాయంతో పాటు జీవనాధారాన్ని కల్పించేందుకు అండగా నిలిచింది. పెదకంచర్ల గ్రామానికి చెందిన ఒంటేరు బాలకోటేశ్వర రావు కుటుంబం అగ్నిప్రమాదంలో తీవ్రంగా నష్టపోయింది. వారికి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఫౌండేషన్ తరపున వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, బియ్యం, దుస్తులతో పాటు ఆర్థిక సహాయం అందజేశారు. గరికపాడు గ్రామానికి చెందిన కొక్కర వీరాంజీ కుటుంబానికి కూడా రూ.5వేలు, వంట సామగ్రి, బియ్యం, దుస్తులు, నిత్యావసర సరుకులు ఫౌండేషన్ ఛైర్‌పర్సన్ లీలావతి అందించారు. ఈ సందర్భంగా చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ, "అగ్నిప్రమాద బాధితులకు అండగా నిలవడం కనీస బాధ్యత అని..శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్ ద్వారా ఈ కుటుంబాలకు సాయం అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లికార్జున రావు, మాదాల చిరంజీవి, రామినేని ఆంజనేయులు, ముత్తినేని హనుమంతరావు, నాగరాజు మాజీ సర్పంచ్, ముక్కంటి వైస్, ముక్కంటి అంజయ్య, పాల్గొన్నారు.

జెవికెఎస్ ప్రసాద్ సేవలు ఉపాధ్యాయలందరికీ ఆదర్శం

ప్రసాద్ మాస్టర్‌ను సన్మానిస్తున్న క్లబ్ సభ్యులు

మాచర్ల రూరల్ : జెవికెఎస్ ప్రసాద్ మాస్టార్ సేవలు ఉపాధ్యాయులందరికి ఆదర్శమని వాసవీ క్లబ్ జోన్ ఛైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అన్నారు. ఇటీవల తులసి ఎడ్యుకేషన్ సోసైటి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జెవికెఎస్ ప్రసాద్‌కు అందజేశారు.స్థానిక దేవాలయంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో జెవికెఎస్ ప్రసాద్ మాస్టార్‌ని సన్మానించారు. జెవికెఎస్ ప్రసాద్ మాస్టార్ మాట్లాడుతూ తనకు అవార్డు రావటం పట్ల ఆయన మాట్లాడుతూ ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను పెంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భవనాశి రవితేజ, బచ్చు రాజ్‌కుమార్, ఆర్ఎస్ చుండూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలో సోమవారం రంజాన్ పండుగను ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి అనంతరం రంజాన్ పండుగను అత్యంత ఘనంగా జరుపుకున్నారు. ఒక్కరికొక్కరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల, గోగులపాడు, కర్లకుంట, విప్పర్ల, ఎడ్వర్డ్ పేట, మునమాక, విప్పర్లపల్లి, అన్నవరం గ్రామాలలోని ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు సామూ హిక ప్రార్థనలు చేశారు. ముస్లిం పెద్దలు, హజరత్ రంజాన్ పండుగ విశిష్టత గురించి వివరించారు. మండలంలో అన్ని గ్రామాలలో మసీదులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పేదలకు, భిక్షగాళ్ళకు, వృద్ధులకు పండ్లు, అన్నదానం చేశారు.

ఉత్తమ పశువైద్యాధికారిగా డాక్టర్ బషీర్

ప్రజాశక్తి - రెంటచింతల

డాక్టర్ బషీర్

రెంటచింతల పశు వైద్యాధికారి డాక్టర్ బషీర్ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉగాది అవార్డుకు ఎంపిక చేస్తూ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ దామోదర నాయుడు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన రెంటచింతల మండలంలో 8 సంవత్సరాల నుంచి పశువైద్య సేవలు అందిస్తున్నారు ఏప్రిల్ 2న విజయవాడలోనే పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో అవార్డును అందుకోనున్నారు పలనాడు జిల్లాలో ఈయన ఒక్కరికే అవార్డు రావడం విశేషం డాక్టర్ కి ఉగాది అవార్డు రావడం పట్ల పశు పోషకులు పలు ఉద్యోగులు గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

రేపు మున్సిపల్ కార్యాలయంలో రుణ మేళా

ప్రజాశక్తి - మాచర్ల :

మాచర్ల పురపాలక సంఘ పరిధిలో 2025-26 ఆర్థిక సంవత్సరమునకు సంబంధించి చంద్రన్న స్వయం ఉపాది, బిసి, ఈబిసి కార్పోరేషన్ లోన్లకు ధరఖాస్తు చేసుకొన్న అర్జిదారులకు బుధవారం రుణ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డి.వేణుబాబు సోమవారం తెలిపారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో 2వ తేదీ ఉదయం 10 గంటలకు రుణమేళా ప్రారంభమవుతుందని, లబ్దిదారుల ఎంపికకు వివిధ బ్యాంకుల బ్రాంచి మేనేజర్లు హాజరుకాన్నుట్లు తెలిపారు. కావున ధరఖాస్తు దారులు ఆన్‌లైన్ అప్లికేషన్, ఆధార్‌కార్డు, సంబంధిత బ్యాంక్ అకౌంటు పాస్ బుక్, పాన్ కార్డు, రేషన్ కార్డులతో రుణ మేళాకు హాజరు కావాలని కమిషనర్ వేణుబాబు కోరారు.

పవన్, కృష్ణతేజను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కృష్ణ తేజతో చరణ్ తేజ

యువతకు స్పూర్తిగా నిలిచి, రాష్ట్ర గ్రామీణా భివద్ధికి కొత్త పథకాలు రూపకల్పన చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఓఎస్డీ మైలవరపు కృష్ణతేజను జనసేన పార్టీ నాయకులు మండలనేని చరణ్ తేజ ఆదివారం కలసి విశ్వవాసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఉగాది పండగ కొ త్త ఆశలు, కొత్త కలలతో జీవితంలో వెలుగులను నింపాలన్నారు. కృష్ణతేజ ప్రభుత్వం దష్టిలో సమ ర్థవంతమైన అధికారి మాత్రమేనని.కాని తాను పని చేసిన కేరళ ప్రజల దష్టిలో తమ జీవితాల్లో వెలుగులు నింపిన అపద్బాంధుడు కొనియాడుతున్నారన్నారు. భావితరం భవిష్యత్తు కోసం, వారిలో మార్పు కోసం అనుక్షణం శ్రమిస్తూన్న కృష్ణ తేజ యువతకు స్పూర్తి దాయకమని, ఉగాది పండుగ జీవితంలో ఎన్నో విజయాలను తీసుకు రావాలని ఆకాంక్షించారు.

రూ.10 లక్షల చెక్కును అందజేసిన జాన్ సైదా

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రంజాన్ పండుగ సందర్భంగా చిలకలూరిపేట పట్ట ణం అడ్డరోడ్డు ఈద్గా వద్ద సోమవారం వేలాది మంది ముస్లిం సోదరులు నల్ల బ్యాడ్జిలతో రంజాన్ ఈద్ నమాజును చదువుకున్నారు. పట్టణంలో కబ్రస్తాన్ స్థల కొనుగోలుకుగాను వైఎస్ఆర్సిపి నాయకుడు జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ చైర్మన్ జాన్‌సైదా రూ. 10లక్షల చెక్కును అంజుమన్ కమిటీ అధ్యక్షుడు జాన్ పీరాకు వేలాదిమంది ముస్లింల సమక్షంలో అందజేశారు. పట్టణ నియోజకవర్గ స్థాయిలో ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. చెక్కు అంద జేసిన జాన్ సైదాకు అంజుమన్ కమిటీ నాయకులు ధన్యవాదాలు తెలియజేశారు.

ఉగాది వేడుకలు

ప్రజాశక్తి మంగళగిరి

తెలుగువారి నూతన సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని మంగళగిరి నగరంలో శ్రీరాధాకృష్ణ యోగ సేవా కేంద్రం వ్యవస్థాపకులు పడమట రాధాకృష్ణ యోగి ఆధ్వర్యంలో ఆదివారం ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గుంటూరు, మంగళగిరి ప్రాంతాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న కొండేపాటి రమేష్, డోకిపర్తి శ్రీహరి రావు, టిఎన్ వరప్రసాద్, కత్తి సుబ్బారావులను ప్రముఖులను సత్కరించి ఉగాది పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో మాచర్ల లక్ష్మీ రాజ్యం, పిసపాటి లక్ష్మి, మాచర్ల వెంకటేశ్వరరావు, పోలిశెట్టి సోమశేఖర్ బాబు, కొమ్మా వాసు, నాని, బాబు, భూషణం పాల్గొన్నారు.

శివాలయం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భోగి కోటేశ్వరరావు

ప్రజాశక్తి మంగళగిరి

లోకేష్‌తో భోగి కోటేశ్వర రావు

మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం (శివాలయం) ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా భోగి కోటేశ్వర రావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతో పాటు ఎనిమిది మందిని ట్రస్ట్ బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. భోగి కోటేశ్వరరావు కొద్ది కాలంగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన కూటమి ప్రభు త్వం శివాలయం ట్రస్ట్ బోర్డు పగ్గాలను అప్పగించింది.

డైరెక్టర్లు వీరే..

శివాలయం ట్రస్ట్ బోర్డు కి 8 మందిని డైరెక్టర్లుగా నియమించారు. సుఖమంచి గిరిబాబు,ఏ కరుణ, జంజనం వెంకట సుబ్బారావు, బాపనపల్లి వాసు, చిలకా బసవమ్మ, ఉడత లావణ్య, ఇసుకపల్లి వెంకట లలిత, తిరుమల శెట్టి మురళీకష్ణలను శివాలయం ట్రస్ట్ బోర్డు కు డైరెక్టర్లుగా నియమించారు. ఆలయ అర్చకులు మహేష్ కుమార్‌ను ట్రస్ట్ బోర్డు ఎక్స్ అఫీషియో నెంబర్‌గా ఎన్నుకున్నారు. నూతనంగా పదవులు పొందిన వారందరికీ పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉరుసు మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ఉరుసు మహోత్సవంలో ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి - పెదకాకాని

దేశంలోనే పేరొందిన దర్గాలలో ఒకటైన పెదకాకానిలోని శ్రీ హజరత్ సయ్యద్ బాజిషహీద్ అవులియా బాబా వారి 537వ ఉరుసు మహోత్సవంలో పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గా ముతావళి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. నరేంద్ర మాట్లాడుతూ మత సామరస్యా నికి నిలువెత్తు నిదర్శనం పెదకాకాని గ్రామన్నారు. ఉరుసు మహెూత్సవంలో పాల్గొన్న భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు వక్ఫ్ బోర్డు అధికారులు షేక్ అబ్దుల్ అజీజ్, షేక్ మహమ్మద్ అలీ, షేక్ ముక్తార్ బాషా తెలియజేశారు.

శివాలయంలో ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పెదకాకాని: మండల కేంద్రమైన పెదకాకాని లోని శివాలయంలో ఆదివారం ఉగాదిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీస్వామి, అమ్మవార్లను భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. సాయంకాలము దేవాలయ ప్రాంగణములో ఆలయ స్థానాచార్యులు, వేదపండితుల వారిచే విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణము చేశారు. కార్య క్రమంలో ఆలయ ఉప కమిషనరు గోగినేని లీలా కుమార్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో ఘనంగా రంజాన్ వేడుకలు

చెంచుపేట మసీదులో ప్రార్ధనలో పాల్గొన్న ముస్లింలు

ఈద్గాలో ప్రార్ధనలో పాల్గొన్న ముస్లిం సోదరులు

ప్రజాశక్తి తెనాలి

రంజాన్ పర్వదిన వేడుకలు పట్టణంలో ముస్లింలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని 23 మసీదులకు సంబంధించిన వారంతా చెంచుపేట ఈద్గాలో చేరి ప్రార్ధనలు నిర్వహించారు. పాండురంగ పేట మక్కా మసీదుకు చెందిన ఇమామ్ మౌలానా షేక్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో ప్రార్ధనలు జరిగాయి. అనంతరం ఈద్గా లోని వారి పితరుల సమాధుల వద్ద నివాళులర్పించారు. రంజాన్ సందర్భంగా మసీదులలో భారీ ఏర్పాట్లు జరిగాయి. వేసవి తీవ్రతను దష్టిలో ఉంచుకొని నూట పది కూలర్లు ఏర్పాటు చేసి, పది వేల వాటర్ బాటిల్స్ నమాజ్‌కు హాజరైన వారికి అందజేశారు. ప్రార్ధన కార్యక్రమాలను దగ్గరగా వీక్షించేందుకు ఏడు ఎల్ఈడీ లను కూడా ఏర్పాటు చేశారు. పాత ప్రభుత్వ వైద్యశాల సమీపంలోని జామియా మసీదులో హఫీజ్ ఇమ్రాన్, వహాబ్ రోడ్డులోని మదీనా మసీదులో ముఫ్తీ ఉస్మాన్ సాహెబ్ ఇస్లాంపేట మర్కజ్ మసీదులో ముఫ్తీ అబ్దుల్లా, పెదరావూరు ఈద్గాలో ముఫ్తీ అల్లావుద్దీన్, చినరావూరు ఈద్గాలో ముఫ్తీ అబ్దుల్ హఫీజ్, పినపాడు ఈద్గాలో ముఫ్తీ షాహిద్ ఆధ్వర్యంలో నమాజ్ జరిగింది.

ప్రజాశక్తి మంగళగిరి

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాలు, మసీదుల వద్దకు అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు చేరుకుని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఇమామ్ లు మాట్లాడుతూ ప్రేమ, సోదర భావం, శాంతికి చిహ్నమే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది ముస్లిం సోదరులు రంజాన్ పర్వదినాన్ని జరుపుకుంటారని, నెల రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉండి అల్లా అనుగ్రహం పొందుతారని తెలిపారు. ఆ అల్లాహ్ చల్లని దీవెనలతో చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

ఉగాది క్రీడా పురస్కారాలు అందజేత

ప్రజాశక్తి మంగళగిరి

గుంటూరుకు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ మంత్లీ మ్యాగజైన్ వారు ఉగాదిని పురస్కరించుకొని ఉగాది క్రీడా పురస్కారాలను జిల్లాకు చెందిన శిక్షకులు సీనియర్ క్రీడాకారులు,క్రీడా ప్రోత్సాహకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా మంగళగిరి కి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోచ్ పీ వి ఎస్ బి సత్యనారాయణ, సభ్యులు డాక్టర్ కే శంకర్ రెడ్డి, కే రమేష్ లకు ఉగాది క్రీడ పురస్కారాలు దక్కాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాసా సీనియర్ మాజీ సైంటిస్ట్ చందు సాంబశివరావు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్ని సంవత్సరాలుగా మంగళగిరి క్రీడాకారులకు సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడుతూ క్రీడా పురస్కారాన్ని అందజేసినట్లు చెప్పారు.

ఉగాది క్రీడ పురస్కారాలు అందుకున్న క్రీడాకారులు

సీనియర్ క్రీడాకారులు కే శంకర్ రెడ్డి, కే రమేష్‌ను సత్కరించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్, గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఫౌండర్, జి శివప్రసాద్, మోడ్రన్ పెంటా తలాన్ చీఫ్ కోచ్ గమిడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసులపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలి

పౌర హక్కుల సంఘం సభలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ప్రజాశక్తి మంగళగిరి

ఆదివాసులపై జరుగుతున్న రాజ్య హింసకు వ్యతిరేకంగా పోరాడాలని, ఛత్తీస్ ఘర్ రాష్ట్రంలో 2024 జనవరి నుండి పోలీసులు చేస్తున్న ప్రతి ఎన్కౌంటర్ బూటకపు ఎన్కౌంటర్ అని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకా చంద్రశేఖర్ అభివర్ణించారు. ఆదివారం రాత్రి మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకష్ణ భవన్‌లో పౌర హక్కుల సంఘం సభ నిర్వహిం చారు. ఈ సభకు పౌర హక్కుల సంఘం గుంటూరు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.కె. నాగూర్ వలి అధ్యక్షత వహించారు. ఈ సభను ఉద్దేశించి చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దాడులను వ్యతిరేకిస్తూ నిరసనలు తెలియ జేయాలని అన్నారు. కేవలం ద్రౌపది ముర్మ లాంటి వ్యక్తులను రాష్ట్రపతిగా చూపించి ఆదివాసులపై బూటకపు ప్రేమను ప్రకటిస్తూ కేంద్ర రాష్ట్ర డబల్ ఇంజన్ సర్కార్ హత్యలకు పాల్పడుతుందన్నారు. కేంద్రమంత్రి అమిత్ షా గడువు విధిస్తూ సాయుధ బలగాలకు టార్గెట్ నిర్ణయిస్తూ బూటకపు ఎన్కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి పొనుగోటి కృపాకర్ మాదిగ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా ఉంటున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రశ్నించే ప్రజలపై దాడులను హత్యలను పెంచుకుంటూ పోతున్నాయని ఆరోపించారు.భారత రాజ్యాంగాన్ని నిలబెట్టుకోవడానికి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సభలో పౌర హక్కుల సంఘం నాయకులు కోటేశ్వరరావు, గోపీనాథ్, మంజు తదితరులు పాల్గొన్నారు.

1350 గ్రాముల వెండి నాగపడిగ, వెండి కిరీటం బహూకరణ

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన రైతు సంఘం నాయకులు కాజా వెంకటేశ్వరరావు రమాదేవి దంపతులు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ గంగా కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయానికి రూ.లక్ష 35 వేల విలువచేసే వెండి నాగపడిగ, వెండి కిరీటాన్ని ఆలయ పూజారికి ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా దాత కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సుమారు 400 సంవత్సరాల చరిత్ర కలిగిన శ్రీ గంగ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవాలయానికి నాగపడిగ, కిరీటం ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. పురాతన ఆలయంగా ప్రసిద్ధిగాంచి, వేంచేసి ఉన్న అన్నపూర్ణ అమ్మవారు గ్రామంలో వేలాది మందితో పూజలు అందుకుంటూ, భక్తులు కోరుకున్న కోర్కెలు తీర్చే మాతగా ప్రసిద్ధికెక్కారని ఆయన అన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు కాజా కాశీ రాంబాబు, కాట్రగడ్డ ఆంజనేయులు, గ్రామ పెద్దలు చాగంటి వెంకటరెడ్డి, కంచు కొమ్మల వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి శ్రీనివాసరావు, కాజా సుబ్రమణ్యం, మహాలక్ష్మి అమ్మవారి గణేష్ యూత్, మహిళలుపాల్గొన్నారు.

వెండి వస్తువులు బహూకరిస్తున్న దాత వెంకటేశ్వరరావు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఉగాది రంజాన్ సందర్భంగా నూతన చలివేంద్రం

ప్రజాశక్తి చేబ్రోలు

ఉగాది రంజాన్ పురస్కరించుకొని మన పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలశెట్టి ఉమాశంకర్ నేతత్వంలో తెలగాపాలెం వంగవీటి మోహన రంగా బొమ్మ దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేశారు. పొన్నూరు పట్టణ పొన్నూరు ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ కె ప్రసాద్ రావు శ్రీ కోదండరామాలయం దేవస్థానం పాలక మండలి సభ్యులు అల్లం సాంబయ్య చుండూరు హనుమయ్య చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఫైర్ ఆఫీసర్ ప్రసాదరావు మాట్లాడుతూ ఎండల తీవ్రత దృశ్య పాదాచార్యులకు, డ్రైవర్లకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సంస్థ సభ్యులను, ఉమాశంకర్‌ను కొనియాడారు. కార్యక్రమంలో అల్లం సాంబయ్య, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమల శెట్టి ఉమాశంకర్ ట్రెజరీ చిలకపాటి సింహాద్రి ఈసీ నెంబర్ పోలిశెట్టి విజయకుమార్ గోపిశెట్టి సురేష్ చిల్లా అనిల్‌నాయుడు తిరుమల శెట్టి మేఘనాథ్ పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాల కోసమేనా మార్పు

ప్రజాశక్తి మంగళగిరి

ఈ సంవత్సరం 25 బి26 విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ విద్యా విధానంలో మార్పులు తీసుకువచ్చింది. కేంద్ర ప్రభుత్వం ఎన్‌సిఆర్‌టి సిలబస్ను రాష్ట్ర ప్రభుత్వ సిలబస్‌గా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశించడంతో ఇంటర్మీడియట్ బోర్డు అనేక మార్పులను తీసుకువచ్చింది. ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం తరగతులు ప్రారంభించడానికి ఆదేశాలు ఇవ్వడం జరిగింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం తరగతులు ఏప్రిల్ 7వ తేదీ నుంచి నిర్వహించినట్లుగా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ మార్పు వెనుక కార్పొరేట్ కళాశాల ఒత్తిడి ఉన్నటుగా తెలిసింది. కార్పొరేట్ కళాశాలకు రాజ్ మార్గం ఏర్పడినట్లుగా విద్యావిధానం ఉందని పలువురు మేధావులు విమర్శిస్తున్నారు.

సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజాశక్తి మంగళగిరి

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఏపీ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాల సమర్పించనున్నామని స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.జానకి రామయ్య, స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు మహేష్ తెలిపారు. 10వ తేదీన గరుడ సేవలో భాగంగా శ్రీ సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తామని చెప్పారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాసరావు, సహాయకార్యదర్శి కిరణ్ పాల్గొన్నారు.

రఘునాధరావును సత్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు

వృత్తి పట్ల అంకితభావం రఘునాధరావు సొంతం

ప్రజాశక్తి తెనాలి

వృత్తి పట్ల నిబద్ధత, అంకితభావంతో పనిచేసిన ఎం.వి రఘునాధరావు అభినందనీయులని మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక నాజరుపేట మున్సిపల్ యు పి స్కూల్లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, సోమవారం పదవీ విరమణ చేసిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఎంవి రఘునాధరావు అభినందన సభ పాంశాల ఆవరణలో నిర్వహించారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం దక్కటం ఆయన నిబద్ధతకు ఉదా హరణగా చెప్పారు. రఘునాధరావు దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ 2 ఎస్టియు నాయకులు అంబరీషుడు, ఎం.వి. గోపాలరావు, పలువురు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాలు అందచేస్తున్న మంత్రి పెమ్మసాని, తులసి రామచంద్రప్రభు

తులసి రామచంద్ర ప్రభు సేవలు ఆదర్శనీయం

ఉపకారవేతనాల పంపిణీలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు

ఎవరి స్వార్థం వారు చూసుకునే ఈ రోజుల్లో తులసి రామచంద్రప్రభు స్వయంగా సంపాదించిన డబ్బుతో నిస్వార్థంగా కొన్ని కోట్ల రూపాయలను పేద విద్యార్థులకు అందించటం అభినందనీయమని, రామచంద్రప్రభు వంటి వారు చాలా అరుదుగా ఉంటారని కేంద్ర గ్రామీణాభివృద్ధి, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక శుభం కన్వెన్షన్‌లో ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఎటువంటి ప్రత్యక్ష రాజకీయాల్లో లేకపోయినా యువతకు విద్య, ఉద్యోగవిషయాలలో తోడ్పడుతూ, ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు వారి సహాయార్థమై ప్రభుత్వానికి లక్షల రూపాయలను వెచ్చిస్తూ, ఇంకా ఎన్నో రకాలుగా ప్రభు ప్రజాసేవ చేస్తున్నారని కొనియాడారు. గుంటూరు సర్వజనాసుపత్రికి మెడికల్ కళాశాల బస్సులకు పది కోట్ల రూపాయలు విరాళంగా ఇవ్వడం గొప్ప విషయమని ప్రభుని అయన కొనియాడారు. అనంతరం అతిథులు, కృష్ణదేవరాయ ట్రస్టు సభ్యుల చేతుల మీదుగా 570 మంది విద్యార్థులకు రూ.30 లక్షలు చెక్కుల రూపంలో ఉపకారవేతనాలు అందజేశారు. అధ్యక్షత వహించిన తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ తాను చదువుకునే రోజులలో కేవలం రూ.16 లు పదో తరగతికి పరీక్ష ఫీజు కట్టలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నానని, బీటెక్ చదివే రోజుల్లో గవర్నమెంట్ నుంచి వచ్చిన రూ.450 ఉపకారవేతనాలతో చదువుకొని జీవితంలో స్థిరపడ్డాక మరలా తిరిగి సమాజానికి ఇవ్వాలనే ఉద్దేశంతో 1995-96 లో ఇద్దరు విద్యార్థులతో మొదలుపెట్టి నేటికి 36 వేల మంది విద్యార్థులకు రూ.22 కోట్లు ఉపకారవేతనాలుగా కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలెజ్డ్ ట్రస్టు ద్వారా పంపిణీ చేసినట్లు ఆయన తెలియజేశారు. దీనికి మేజర్ కాంట్రిబ్యూషన్ తులసి సీడ్స్ సమకూరుస్తుందని, దాంతో పాటు నగరంలోని కొంతమంది సమాజ హితం కోరే పెద్దలు ట్రస్టులో సభ్యులుగా చేరి సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. 2022, 2023, 2024 సంవత్సరాల్లో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మొత్తం రూ.30 లక్షలు ఉపకారవేతనాలుగా అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ట్రస్ట్ ట్రస్టీలు తులసి యోగిష్‌చంద్ర, తులసి కృష్ణచైతన్య, నారదాసు శ్రీహరిరావు, మలిశెట్టి సుబ్బారావు, ఉగ్గిరాల సీతారామయ్య, తోట శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మేడ్ అధ్యక్షులు దేవపాల్‌కు ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

అవార్డు అందుకుంటున్న మురికిపూడి దేవపాల్

రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన ఉగాది సంబరాల కార్యక్రమంలో మేడ్ రాష్ట్ర అధ్యక్షులు మురికిపూడి దేవపాల్‌ను ఉగాది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అవార్డు అంద చేశారు. సేవా రంగంలో చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందించినట్లు దేవపాల్ తెలిపారు. దుశ్శాలువ, మెమోంటో, సర్టిఫికెట్, రూ.10వేలు నగదు బహుమతి అందచేశారని తెలిపారు.

12న గుంటూరులో ఏకలవ్యుడి విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

ఆహ్వానపత్రాలు అందదేస్తున్న నాయకులు

గుంటూరు, అమరావతి రోడ్, నగరాలు ప్రధాన రహదారిలో 'జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం' ఆధ్వ ర్యంలో ఈనెల 12న జరగనున్న 'ఏకలవ్య విగ్రహారణ' కార్య క్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్సీ, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు కుంభా రవిబాబు పిలుపునిచ్చారు. ఏకసంతాగ్రాహిగా గురువుని మించిన శిష్యుడిగా కీర్తి గడించడమే గాక తన బొటనవేలును త్యాగం చేసిన ఆదర్శప్రాయుడు ఏకలవ్యుడని, అటువంటి మహనీయుడి విగ్రహావిష్కరణలో ప్రతి ఒక్కరూ పాల్గొనాల ని కోరారు. సోమవారం గుంటూరు నగర శివారులోని ఓ హోటల్లో అరకు ఎంపీ గుమ్మా తనూజారాణి, పాడేరు ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజు, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు మానుపాటి నవీన్, కుంభా ఉదయ్, ఎమ్మెల్సీ రవిబాబుని విగ్రహ ఆవిష్కరణ కమిటీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రాలను అందచేసి, సన్మానించారు. ఈ సందర్భం గా జైఏకలవ్య అభ్యుదయ సేవా సంఘ అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య, చైర్మన్ కావడి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఎరుకల సంఘీయులలో ఐకమత్యం తెచ్చేందుకు ఆయన విగ్రహాన్నీ వాడవాడల ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు టి.పాపారావు, కుంభా సుబ్బారావు, టి.రామకృష్ణ, కుంభా ఏడుకొండలు , మేడా బ్రహ్మయ్య, కావడి నాగేశ్వరరావు, నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా రాంబాబు పాల్గొన్నారు.

పైర్లు ఎండకుండా చివరిసాగుకూ నీళ్లు..

వారాబంది పద్ధతిలో సాగు నీటిని వాడుకోవాలి : పల్నాడు జిల్లా ఎస్ఇ పి.కృష్ణ

ప్రస్తుతం మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు చివరి దశలో ఉన్నందున రైతుల అవసరాలు తీర్చేందుకు సరిపడా సాగు నీరు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నామని నాగార్జున సాగర్ జలాశయం పల్నాడు జిల్లా ఎస్ఇ పి.కృష్ణ మోహన్ అన్నారు.ఇప్పటికే ఈ విషయమై జిల్లా కలెక్టర్ కు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్ళామన్నారు. ఆయా అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మాట్లా డారు. నీరు లేక ఒక్క సెంటు ఎండరాదని జిల్లా కలెక్టర్ ఆదేశించారని ఈ మేరకు ప్రతి ఎకరాకు సాగు నీరు ఇవ్వాలన్న లక్ష్యం మేరకు ప్రణాళికలు రూపొందించి ఆ దిశగా సాగు, త్రాగు నీటి అవసరాలకు నీరు విడుదల చేస్తున్నామన్నారు. పంటలకు వార బంది పద్ధతిలో విడుదల చేస్తున్న సాగు నీటిని వృధా కానివ్వకుండా రైతులు వాడుకోవాలని తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ నుండి రబి వరకు సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు విడుదల చేయడం జరిగిందన్నారు. ఒక్క సెంటు పంట భూమి కూడా ఎండకుండా అన్ని శాఖల సమన్వయంతో సాగులో ఉన్న పంటల చివరి కాలం వరకు సాగు నీటిని పొదుపుగా వాడుకోవాలని పేర్కొన్నారు. సాగు నీటిని వృథా చేయరాదని, అవసరానికి మించి పంటలకు ఇవ్వరాదని, అలా చేయడం వల్ల నష్టమే తప్ప లాభం ఉండదని తెలిపారు.

ఆయకట్టు పరిధిలో ఏయే ప్రాంతాలకు సాగు నీరు సరఫరా అవుతుంది?

పల్నాడు జిల్లాలోని 7 నియోజకవర్గాలతో పాటు గుంటూరు జిల్లా తాటికొండ, ప్రత్తి పాడు, బాపట్ల జిల్లా అద్దంకి, ప్రకాశం జిల్లా దర్శి మొత్తం 11 నియోజకవర్గాల పరిధిలో గల సాగు భూమికి నీరు సరఫరా అవుతుంది.

ఆయకట్టు పరిధిలో ఎన్ని ఎకరాల సాగు భూమి ఉంది ?

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 6,68,230 ఎకరాలు, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 4,43,180 ఎకరాలు మొత్తం కలిపి 11,11,410 ఎకరాల సాగు భూమి ఉంది.

సాగర్ లో నీరు వేసవి తాగు నీటి అవసరాలు తీరుస్తాయా?

ప్రస్తుతం తాగు నీటి చెరువులు ఇప్పటికే పూర్తి స్థాయిలో నింపడం జరిగింది. మే నెల మొదటి వారంలో 8 టిఎంసిల నీటిని కేవలం తాగునీటి అవసరాలకు విడుదల చేసి మంచినీటి సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాము.

సాగర్ కాల్వల మరమ్మతుపనులు చేయడానికి నిధులు మంజూరు అయ్యాయా? జిల్లాకు ఎన్ని నిధులు వచ్చాయి?

కూటమి ప్రభుత్వం ఏర్పడగానే కాల్వలలో పూడికతీత, సాధారణ మరమ్మతులకు సంబంధించి రూ .18 కోట్లు విడుదల చేసింది. అదే విధంగా ఫేజ్ - 1 కింద వినుకొండ, మాచర్ల, మాచర్ల, లింగంగుంట్ల డివిజన్ మెయింటెనెన్స్ కింద తక్షణం చేపట్టాల్సిన 385 పనులకు సంబంధించి రూ 21.50 కోట్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు నివేదించాం. ఫేజ్ - 2 కింద మేజర్ పనులకు మరో రూ 18 కోట్లకు అంచనాలు వేసి ఉన్నాము.

కాల్వ ల్లో పూడిక తీత పనులు ఎప్పుడు ప్రారంభం చేస్తారు?

నీటి విడుదల నిలిపివేయగానే కాల్వ మరమ్మతులు చేపట్టి రానున్న ఖరీఫ్ నాటికి చివరి భూములకు సైతం సాగు నీరు అందేలా పనులు సకాలంలో పూర్తి చేసేందుకు సన్నా హాలు జరుగుతున్నాయి.

జిల్లాలో అనేక ప్రాంతాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పంట కాలువలు ఆక్రమించారు? వారిపై ఎటువంటి చర్యలు చేపట్టారు?

జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాలలో స్థిరాస్తి వ్యాపారులు పంట కాల్వలు ఆక్రమిం చినట్లు 9 చోట్ల నుండి ఫిర్యాదులు వచ్చాయి. 2 ఫిర్యాదులు విచారణ పూర్తి చేసి చర్యలు చేపట్టాం.

ఎప్పటి నుంచి కుడి కాలువకు నీటి సరఫరా ఆపుతారు?

ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 5 వ తేదీ వరకు సాగు నీరు విడుదల కానుంది. మిర్చి, వరి, మొక్క జొన్న పంటలు చివరి దశకు చేరనున్న నేపథ్యంలో ఏప్రిల్ చివరి వరకు నీరు విడుదల చేయాలని రైతులు, రైతు సంఘాల సూచన మేరకు నేపథ్యంలో ఉన్నతాధికారులకు నివేదించాం.

రైతులకు ఏమైనా సూచనలు చేస్తారా?

ప్రతి రైతు నీరు వృధా కాకుండా జాగ్రత్తగా వినియోగించుకోవాలి. చివరి భూమి రైతులకు పై వైపు ఉన్న రైతులు సహకరించాలి. చివరి భూమి రైతులు 2వ పంట వేయకుండా ఉండ డం ఉత్తమం.

(ప్రజాశక్తి - పల్నాడు జిల్లా)

రూ. 152 కోట్లు ఆస్తి పన్ను వసూలు

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగర పాలక సంస్థలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.152 కోట్లు ఆస్తి పన్ను వసూలైనట్లు కమిషనర్ పి.శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాదికంటే ఇది రూ.32 కోట్లు అధికమని పేర్కొన్నారు. చివరి రోజైన సోమవారం రూ.6.10 కోట్లతో కలిపి మొత్తం రూ. 26.10 కోట్లు పన్ను నగర ప్రజలు చెల్లించారని తెలిపారు.

సందడిగా ఆర్‌విఐటి 'యువ' వేడుకలు

ప్రజాశక్తి - గుంటూరు

ఆర్‌విఐటి చేబ్రోలులో రేఖాన్-2025 పేరుతో నిర్వహించిన నేషనల్ కల్చరల్ స్పోర్ట్స్ టెక్నికల్ ఫెస్ట్ ముగింపు వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహిం చారు. క్రీడలు, సాంస్కృతిక పోటీలతోపాటు సాంకేతిక అంశాల్లో విజేతలకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌వి.కృష్ణయ్య బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం డాన్స్ మాస్టర్ పండు, జూనియర్ డాన్సర్ తనుశ్రీ తమ నత్య ప్రదర్శనతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ ఆర్.వంశీకష్ణ, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రసవత్తరంగా కొనసాగుతున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

బండ లాగుడు పోటీలో ఒంగోలు జాతి గిత్తలు - తెనాలి పట్టణంలో గ్రామీణ ప్రాంత వాతావరణం

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పోటీపడుతున్న బాపట్ల జిల్లా ఎడ్ల జత

ఉన్నత చదువులకు అమెరికాకు వెళ్లిన, ఇతరదేశాల్లో స్థిరపడిన భారతీయలు రైతు వ్యవస్థను విస్మరించకూడదని నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. తెనాలిలో నిర్వహిస్తున్న ఆలపాటి శివరామకృష్ణయ్య మెమోరియల్ జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో సోమవారం అరవింద్ బాబు, టిడిపి అధికార ప్రతినిధి వర్ల రామయ్య ముఖ్య అతిథిలుగా పాల్గున్నారు. కృష్ణ గుంటూరు ఉమ్మడి జిల్లాల పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, కార్యాక్రమ కన్వీనర్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎడ్ల జతల బల ప్రదర్శన పోటీలు సోమవారం మూడోరోజు కొనసాగుతున్నాయి. తెనాలి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు ప్రాంగణంలో జరుగుతున్న పోటీలతో పాటు, పశుపాల ప్రదర్శన, వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ మాట్లాడుతూ విశ్వవసు నామ సంవత్సరంలో రైతులకు మేలు జరగబోతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతాంగానికి పెద్దపీట వెయ్యిబోతున్నట్లు తెలిపారు. ప్రజాలకు ఉగాది, రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్లిన ఇతర దేశాల్లో స్థిరపడినా దేశ సంస్కృతి సంప్రదాయాలను విస్మరించ కూడదని అన్నారు. గ్రామీణ నేపథ్యాన్ని తలపిస్తూ ఏర్పాటుచేసిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు రాష్ట్రానికే తలమానికం అన్నారు. ఇంతటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను అభినందించారు. తన తండ్రి శివరామ కృష్ణయ్య ప్రారంభించిన ఎడ్లబల ప్రదర్శన పోటీలను తనయుడిగా ఆలపాటి రాజేంద్రప్రసాద్ కొనసాగించడం ముదావహమని టిడిపి అధికార ప్రతినిధి వర్ల రామయ్య అన్నారు. రైతు పక్షపాతిగా పేరుగాంచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ రాజకీయంలో అధికార పగ్గాలు చేపట్టడంతో పాటు ఇలాంటి గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ప్రదర్శనలకు కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న వేమూరి శాసనసభ్యులు నక్కా ఆనందబాబు ముందుండి నడుపుతున్న కార్యక్రమాలు తీరు ప్రేక్షకాదరణ పొందుతుందని చెప్పారు. అనంతరం ముఖ్య అతిధులను దుశ్శాలువాతో సత్కరించి రైతు కానుక అందజేశారు.